Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 21.06.2013, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 03 పేజీలు : 12, వెల : ₹ 4



Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
CARE
SUPER SPECIALITY
DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555
Reimbursement Facility For
State Government, APSPDCL & SHAR Employees

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

# ముదిరిన ముఖ్యమంత్రి



## ఎవ్వరినీ లెక్కచేయడం లేదు

ఎవరు ఎటయినా పోనీ, ఎవరెన్నయినా అనుకోనీ, ఎవరెన్ని అడ్డంకులైనా కల్పించనీ నా దారి రహదారి అన్నట్లు ముందుకు పోతున్నాడు రాష్ట్ర ముఖ్య మంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి. ఆయన మొండితనం కాంగ్రెస్‌పార్టీకి తలనొప్పులు తెస్తుందని చాలామంది భావించారు. కాని ఆ మొండితనమే ఈరోజు కాంగ్రెస్‌లో ఆయనను గట్టి నాయకుడిగా నిలిపింది.

## ఎవరిమాటా వినడం లేదు

కిరణ్ సీఎం అయ్యాక ఆయన పదవి మూణ్ణాళ్ళ ముచ్చటే అనుకున్నారు. కిరణ్‌ను ఎప్పుడైనా మార్చవచ్చు అనే వాతావరణాన్ని కల్పించారు. నాలుగోసీఎంగా కొత్త నాయకులను తెరమీదకు తీసుకొచ్చారు. కాని కిరణ్ వీటిని ధాటిగా ఎదుర్కొన్నాడు. తన వ్యతిరేక వర్గాన్ని చిత్తుచేసుకుంటూ వచ్చాడు. దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి సీఎం అయ్యాక తన ప్రత్యర్థులను మంచిగా వ్యవహరించి

(మిగతా 5వ పేజీలో)

# తెలంగాణ 'ప్యాక్'అప్





తెలంగాణ ఉద్యమం ఇక ప్యాకప్ కాకతప్పదు. స్పెషల్ ప్యాకేజీతో దానిని ప్యాకప్ చేయడానికి కేంద్రప్రభుత్వం రంగం సిద్ధం చేసినట్లుగా తెలుస్తుంది. టీ-జాక్ ఉద్యమాలు చేసినా, సర్వజనుల సమ్మె చేసినా, అసెంబ్లీని ముట్టడించినా, కేసీఆర్ లాంటి ఉద్యమవ్యాపారులు బెదిరించినా కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం లెక్కచేయడం లేదు. ప్రస్తుతానికి ప్రత్యేక ప్యాకేజీతో ఈ సమస్యకు తెరదించాలని కేంద్రం భావిస్తుంది. కాంగ్రెస్‌లో కూడా తెలంగాణ గురించి

(మిగతా 5వ పేజీలో)

# పసలేని విస్తరణ





ఇటీవలే ప్రధాని మన్మోహన్ సింగ్ తన మంత్రి మండలిని విస్తరిస్తూ అందులో 8మందికి చోటు కల్పించారు. ఇందులో ఇద్దరు ఆంధ్రావాళ్లే! ఏలూరు ఎంపీ కావూరి సాంబశివరావు కేంద్ర జౌళిశాఖమంత్రిగా, రాజ్యసభసభ్యులు జె.డి.శీలం కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రిగా బాధ్యతలు చేపట్టడం జరిగింది.


కావూరి సాంబశివరావు చాలాకాలంగా కేంద్రంలో మంత్రిపదవి కోసం ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్‌లో చాలా సీనియర్ ఎంపి.

(మిగతా 5వ పేజీలో)

Escon DEVELOPERS

నెల్లూరులో మొట్టమొదటి సారిగా...
అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయబడిన
రెసిడెన్షియల్ గేటెడ్ కమ్యూనిటి టౌన్‌షిప్


DTCP APPROVED LAYOUT




Adithya Elixir
(Residential Gated Community Township)
For Luxurious Living

@ Krishnapatnam New Port Road, Just 1 KM far From N.H.5,
Just 15 minutes Drive from R.T.C. Bus Stand, Nellore.






Amenities :-

- 24x7 Security
- Underground Electricity
- Underground Sewage System with treatment plant
- Underground Rain Water Drainage
- 24 Hours Water Supply
- Compound Wall With Arch
- Spacious Tar Roads
- Children Play Area With Play Equipments
- 30,000 sft Club House
- Health Clubs separate for Ladies & Gents
- Swimming pools separate for Ladies & Gents
- Gym separate for Ladies & Gents
- Sai baba Temple & Anjaneya Statue
- Spacious Parks
- Tennis Court
- Indoor Shuttle


Contact :
+91 965 241 5441 +91 888 554 1233 +91 990 841 7936
Web-site:www.escondevelopers.com

PDF Compressor Free Version



## కావలి కాంగ్రెస్‌లో...

# రేగుతున్న మంటలు



కావలి కాంగ్రెస్‌లో వర్గవిభేదాలు రాజుకుంటున్నాయి. ఇక్కడ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి మాజీఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డికి మధ్య చిచ్చుపడింది.



మంత్రి అనవసరంగా కావలి వ్యవహారాలలో తల దూరుస్తున్నాడని కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపిస్తుంటే, నియోజకవర్గంలో విష్ణుకు అంత సీన్‌లేదని, ఇక్కడ పార్టీ మనుగడ కోసం జోక్యం చేసుకోక తప్పడం లేదని ఆనం వర్గం వాదిస్తుంది.

కావలి కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు తారాస్థాయిలో వున్నాయి. మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ బాళ్లూరి రమణయ్యనాయుడుతో పాటు పలువురు కావలి నేతలు విష్ణువర్ధన్‌రెడ్డి నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. 1989 నుండి విష్ణు అల్లూరు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడుగా వుంటున్నారు. 1994, 1999లలో ఇక్కడ నుండి ఆయన ఓడిపోయారు. 2004 ఎన్నికలలో మాత్రం అల్లూరు నుండి గెలిచారు. 2009లో జరిగిన నియోజక వర్గాల పునర్విభజనలో అల్లూరు ఎగిరిపోయింది. దీంతో విష్ణు కావలికి బదిలీ అయ్యారు. కావలి నుండి ఆయన ఓడిపోతాడని తెలిసినా 2009ఎన్నికలలో వై.యస్. ఆయనకే సీటిచ్చాడు. అనుకున్నట్లే ఓడిపోయాడు. వై.యస్. మరణానంతరం సంభవించిన పరిణామాల నేపథ్యంలో విష్ణు జగన్ వైపు నడిచి వైకాపాలో చేరాడు. అయితే ఆయనకు ఆ పార్టీ ముచ్చట మూణ్ణాళ్లే అయ్యింది. వైకాపా కావలి ఇన్‌ఛార్జ్‌గా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని నియమించడంతో విష్ణుకు భవిష్యత్ పిక్చర్ అర్థమైంది. వైకాపాలో కావలి సీటు తనకు ఇవ్వరని అర్థమై గోడకు కొట్టిన బంతిలా తిరిగి కాంగ్రెస్‌లోకి (మిగతా 5వ పేజీలో)

## • ఉదయగిరి వైసిపిలో ముదిరిన వర్గపోరు



దారినపోయే తలనొప్పిని బ్యానర్లుకట్టి మరీ ఆహ్వానిస్తుంటారు మేకపాటి సోదరులు. ఆ తలనొప్పిని తమకే కాక వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి కూడా చుడుతుంటారు. ఇప్పుడు ఉదయగిరి నియోజకవర్గంలో ఇలాంటి తలనొప్పినే మెట్టుకూరు చిరంజీవిరెడ్డి రూపంలో తెచ్చుకున్నారు.



# ఉరుముతున్న మెట్టుకూరు

కలిగిరి మండలంలో మంచి పేరున్న నాయకుడు మెట్టుకూరు చిరంజీవిరెడ్డి. మండల రాజకీయాలను ఒంటిచేత్తో శాసిస్తున్న యువకుడు. 2006లో కలిగిరి జడ్పీటీసీగా అత్యధిక మెజార్టీతో గెలిచిన చిరంజీవిరెడ్డికి జడ్పీఛైర్మన్‌గా వున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డితో స్నేహం ఏర్పడింది. ఆ స్నేహభావంతోనే ఆయనతో పాటే కాంగ్రెస్‌ను వదిలి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరాడు. కాకాణి ముఖ్యఅనుచరుడిగా వుంటూనే ఇటీవల ఉదయగిరి ఉపఎన్నికలలో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి గెలుపుకు కృషి చేసాడు. ఆరోజుకు కూడా మేకపాటితో విభేదాలున్నా, కాకాణి సూచనతో వాటిని పక్కనపెట్టి పార్టీ కోసం పనిచేసాడు.

ఇంతవరకు బాగానే వుంది... కాని మెట్టుకూరు వ్యవహారంలో మేకపాటి సోదరుల తీరే విమర్శలపాలయ్యింది. కలిగిరి మండలంలో ఎవరి సత్తా ఏంటో బహిరంగ రహస్యం. కాని మేకపాటి సోదరులు మొన్న సొసైటీ ఎన్నికలలో సిద్ధనకొండూరు సొసైటీ నుండి సొంతంగా అభ్యర్థులను నిలబెట్టారు. చిరంజీవిరెడ్డితో కనీసం సంప్రదించను కూడా లేదు. దీంతో చిరంజీవిరెడ్డి ఈ సొసైటీలో అన్ని స్థానాల నుండి తన అభ్యర్థులను దించాడు. అందర్నీ గెలిపించుకోవడమేకాక తాను సొసైటీ అధ్యక్షుడుగా ఎన్నికయ్యాడు. ఇక్కడ మేకపాటి సోదరుల గాలి తీసినట్లయ్యింది. ఇది వాళ్లకు తీరని అవమానమైంది. దీంతో చిరంజీవిరెడ్డి మీద పగబట్టి, ఆయనను ఆయన అనుచరులు మరో ముగ్గురిని పార్టీ నుండి సస్పెండ్ చేయించారు. ఇప్పుడదే మేకపాటి బ్రదర్స్‌కు క్రింద మంటగా తయారవుతుంది. సస్పెండ్ చేయగానే చిరంజీవిరెడ్డి చేతులు ముడుచుకు కూర్చోలేదు. మేకపాటి సోదరులకు తన సత్తా ఏంటో చూపాలనుకుంటున్నాడు. మొన్న 16వ తేదీనే దీనికి అంకురార్పణ చేసాడు. కలిగిరి, జలదంకి, కొండాపురం మండలాల నుండి వ్యతిరేకంగా కలిగిరిలో ఆత్మగౌరవ పోరాటసభ ఏర్పాటు చేసారు. మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిని ఓడించడమే లక్ష్యంగా ప్రజలు భారీగా తరలివచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఉదయగిరి నుండి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిని ఓడించడమే లక్ష్యంగా తన భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికకు శ్రీకారం చుడుతున్నాడు. ఏ పార్టీలో చేరకుండా జగన్ అభిమానిగా, కాకాణి అనుచరుడిగా వుంటూనే వచ్చే ఎన్నికల్లో ఉదయగిరి నుండి పోటీ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాడు. ఇందుకోసం రాజన్న దళం పేరుతో ఒక పార్టీ, దానికొక కార్యవర్గానికి (మిగతా 5వ పేజీలో)

# ప్రైవేట్‌పై "ఫోర్స్"

▸ 50మంది ప్రధానోపాధ్యాయులతో కమిటీ ▸ జిల్లా వ్యాప్తంగా తనిఖీలు

వేలకువేలు ఫీజులు గుంజుతున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సరైన మౌలిక సదుపాయాలు మాత్రం కల్పించడంలేదు. విద్యార్థులకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, ఆట మైదానాలు కల్పించడం లేదు. అర్హతగల ఉపాధ్యాయులను నియమించడంలేదు. దీంతో విద్యార్థుల అవస్థలు చెప్పనలివి కావడం లేదు. పాఠశాలలను తనిఖీ చేయాల్సిన యంఇవోలు పని వత్తిడి వల్ల వారి జోలికే పోవడం లేదు. అక్కడక్కడ కొన్ని పాఠశాలల్లో షేక్‌హ్యాండ్లు ఇచ్చుకుంటున్నారన్న విమర్శలు లేకపోలేదు. దీంతో ప్రైవేటు పాఠశాలలను కట్టడిచేయాలని టాస్క్‌ఫోర్సును నియమించారు. 50మంది ప్రధానోపాధ్యాయులతో కూడిన ఈ కమిటీ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేస్తుంది. ఇద్దరు చొప్పున మొత్తం 25కమిటీలు రంగంలోకి దిగాయి. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులే ఈ కమిటీలో సభ్యులుగా వ్యవహరించారు. బుధవారం నుండి కమిటీ సభ్యులు పర్యటించారు. ఒక్కో కమిటీలోని సభ్యులు సుమారు పది పాఠశాలలను తనిఖీ చేయాల్సివుంటుంది. కాని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో ఈ కమిటీ సభ్యులు షేక్‌హ్యాండ్ ఇచ్చుకోకుండా జాగ్రత్తగా వ్యవహరించాల్సివుంది.

## • కోలుకోని రియల్టర్...



# నడ్డి విరుస్తున్న వడ్డీలు

## చౌకగా అమ్ముతున్న ఆస్తులు

**టీచర్, డాక్టర్, యాక్టర్, లాయర్, బిజినెస్‌మెన్, పోస్ట్‌మెన్, వాచ్‌మెన్... వారనీవీరని లేదు... మొన్నటి వరకు చాలామందికి రియల్‌ఎస్టేట్ అనేది ప్రవృత్తిలాగా వుండేది. వృత్తిలో శ్రమ ఎక్కువ, లాభం తక్కువ. అదే ప్రవృత్తి రియల్‌ఎస్టేట్‌లో అయితే... జాక్‌పాట్ తగిలితే శ్రమ తక్కువ... లాభం ఎక్కువ. ఇలాంటి జాక్‌పాట్ ఆదాయాల కోసమే ప్రతిఒక్కరూ రియల్‌ఎస్టేట్‌లోకి అడుగు పెట్టారు. వారిలో చాలామంది ఇప్పుడు భూములు కొనడానికి తెచ్చిన అప్పులపై వడ్డీలు కట్టలేక అల్లాడుతున్నారు.**

నెల్లూరు జిల్లాలో అన్ని రకాల వృత్తుల్లో వుండే చాలామందికి రియల్‌ఎస్టేట్ ప్రవృత్తి. రియల్‌ఎస్టేట్ చేసేవారిలో డాక్టర్లు కూడా అధికసంఖ్యలో వున్నారు. కొంతమంది డాక్టర్లయితే కొన్నేళ్లుగా వృత్తిలో సంపాదించిన దానికంటే, కొద్దికాలంలోనే రియల్‌ఎస్టేట్‌లో పెట్టుబడులుపెట్టి కోట్లు సంపాదించారు. ఇలా కొద్దికాలంలో కోట్లు కళ్లజూసేసరికి రియల్ వ్యాపారం మీద మోజు, క్రేజు పెరిగింది. చిన్నాచితకావాళ్లు కూడా లక్షలు, కోట్లలో అప్పులు తెచ్చి భూములమీద పెట్టుబడులు పెట్టారు. భూముల విలువను అమాంతం పెంచేసి ఆత్రంగా కొనేసారు.

వై.యస్. మరణానంతరం జిల్లాలోనే కాదు రాష్ట్రంలో కూడా రియల్ భూమ్ దారుణంగా పడిపోయింది. నెల్లూరులో అయితే మరీను. కృష్ణపట్నం పోర్టును చూసి ముత్తుకూరు, చింతవరం రోడ్లలో, ఎయిర్‌పోర్ట్, ఇఫ్‌కోసెజ్ అనేసరికి నెల్లూరు-కావలి మార్గంలో, మేనకూరు సెజ్ అనేసరికి నాయుడుపేట వద్ద, అపాచీ, శ్రీసిటీల వల్ల సూళ్లూరుపేట, తడలలో కోట్లుపెట్టి భారీఎత్తున భూములు కొనుగోలు చేసారు. రియల్ భూమ్ పడిపోయాక ఈ భూములను అడిగే నాథుడే లేకుండా పోయాడు. కొన్ని చోట్ల ఎకరా కోటిరూపాయలకు కొన్న భూమిని పాతిక లక్షలకు కూడా అమ్ముకునే పరిస్థితి లేకుండా పోయింది. రియల్టర్ల పరిస్థితి దీనాతిదీనంగా తయారయ్యింది. వడ్డీలు కొండలా పెరిగిపోతుంటే ఆస్తులు కర్పూరంలా కరిగిపోతున్నాయి. మధ్యలో కొందరు రియల్టర్లు అప్పులు చేసి చేతులెత్తేయడంతో ఆ ప్రభావం రియల్ మార్కెట్ మీద తీవ్రంగా పడింది. ఇప్పుడు వడ్డీ వ్యాపారులు స్థలాలను తమ పేర్లతో రిజిస్ట్రేషన్ చేసుకున్నాకే రియల్టర్లకు అప్పులిస్తున్నారు. ఇంతకుముందయితే కనీసం తనఖాపెట్టుకునన్నా ఇచ్చేవాళ్లు. అంతేకాదు, ఆరునెలల్లోపు అసలు, వడ్డీ కట్టకపోతే తాకట్టుపెట్టిన స్థలం మీద ఆశలు వదులుకోవాలని నిబంధనలు పెడుతున్నారు. రియల్టర్ల సమస్యలు వడ్డీవ్యాపారులకు వరంగా మారుతున్నాయి. రియల్‌మార్కెట్ కోలుకునే అవకాశాలు కనుచూపు మేరలో కనిపించడంలేదు. ప్రభుత్వం మారితేనన్నా తమకు మంచిరోజులొస్తాయేమోనని రియల్టర్లు ఆశిస్తున్నారు.

# ఎన్నికల్లో జాగ్రత్తలు తీసుకోండి



సమీక్షాసమావేశంలో ప్రసంగిస్తున్న సి.హెచ్.పెంచలరెడ్డి

నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 15న ఎన్నికల విధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎంపిడీఓలతో ఏజేసి, ఇన్‌చార్జి డి.పి.ఓ సి. హెచ్ పెంచలరెడ్డి సమీక్షాసమావేశం నిర్వహించారు. త్వరలో రానున్న ఎన్నికల విధుల్లో అధికారులు అప్రమత్తంగా వుండాలని, సమస్యాత్మక గ్రామాల్లో తగిన పోలీస్ సిబ్బందిని సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. పోలింగ్ స్టేషన్ల వివరాల ముసాయిదాను ప్రచురించాలని, అభ్యంతరాలను పరిశీలించి అందరికీ ఆమోదయోగ్యమైన పోలింగ్ స్టేషన్ల వివరాలను ప్రచురించాలన్నారు. వెబ్‌కాస్టింగ్, వెబ్‌కెమెరా, మైక్రో అబ్జర్వర్, స్ట్రైకింగ్ ఫోర్స్‌లలో ఒకదాన్ని పోలింగ్‌స్టేషన్ వద్ద ఏర్పాటుచేయాలని పేర్కొన్నారు. ఓటరు గుర్తింపుకార్డుతో పోలింగ్ కేంద్రానికి వచ్చేలా ముందస్తు ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు మాధవీలత, సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, జడ్పీ ఏఓ వసుమతీ, డిపిఓ, ఏఓ సుధ, ఎంపిడీఓలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుంది

నాపూరులో కాకాణి దీవెనయాత్ర



పొదలకూరు మండలం నాపూరులో ఈనెల 18న వైయస్సార్సీపీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త కాకాణి గోవర్ధన్‌రెడ్డి దీవెనయాత్ర చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు ఓట్లేయరనే భయంతోనే సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, మంత్రులు ఒక అడుగు ముందుకు, నాలుగడుగులు వెనక్కు వేస్తున్నారని ఎద్దేవా చేసారు. ఆరు నెలలుగా పంచాయితీ ఎన్నికలు నిర్వహిస్తామంటున్న వారు ఇప్పటి వరకు రిజర్వేషన్ల ప్రక్రియను ఒక కొలిక్కి తేలేదన్నారు. పంచాయితీ ఎన్నికలు జరగక రెండేళ్ళుగా పంచాయితీలు ప్రత్యేకాధికారుల పాలనలో సమస్యలతో సతమతమవుతున్నాయన్నారు. దివంగతనేత వైయస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రతి పథకాన్ని పక్కా ప్రణాళికతో అమలు చేసారని, కాని నేటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి సంక్షేమ పథకాలను నీరుగారుస్తున్నారన్నారు. రైతులకు 2వేల కోట్లు రుణాలు అందజేస్తామని ప్రకటించి 312కోట్లు మాత్రమే అందజేసారన్నారు. వ్యవసాయం, రైతుల సమస్యలపై అవగాహనలేని వ్యక్తి ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టమని అందుకే కౌలురైతులకు రుణాలు మంజూరు చేయడంలో విఫలమయ్యారన్నారు. జడ్పీ ఛైర్మెన్‌గా తానున్నప్పుడు నాపూరులో 60లక్షలతో అభివృద్ధి పనులు చేసానన్నారు. కార్యక్రమంలో వైయస్సార్సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, చింతంరెడ్డి జనార్ధన్‌రెడ్డి, మండల పరిషత్ మాజీఅధ్యక్షుడు నోటి మాలకొండారెడ్డి, కోడూరు ఆనందరెడ్డి, వాకాటి శ్రీనివాసులురెడ్డి, బెల్లంకొండ చంద్రమౌళినాయుడు, బొడ్డు అబ్బయ్యనాయుడు, కొల్లూరు నరసయ్యనాయుడు, నాపూరు సుధాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# హమ్మయ్యా...అందరూ సురక్షితం...



- ఉత్తరకాశీ నుంచి నెల్లూరు చేరిన 43మంది
- ఊపిరి పీల్చుకున్న బంధువులు

ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న సరస్వతీనది పుష్కరాల్లో పాల్గొనేందుకు వెళ్ళిన నెల్లూరుజిల్లా వాసులు అక్కడ భారీగా కురుస్తున్న వర్షాల్లో చిక్కుకుని ఎట్టకేలకు వరదలు తగ్గుముఖం పట్టడంతో సురక్షితంగా బయటపడ్డారు. ఉత్తరకాశీలో వరదల్లో చిక్కుకున్న వారిలో 43మంది మంగళవారం నెల్లూరు చేరారు. మిగిలిన 45మంది రెండు, మూడు, రోజుల్లో జిల్లాకు రానున్నారు. ఉత్తరాఖండ్‌లో కురుస్తున్న భారీవర్షాలు మంగళవారంతో తగ్గుముఖం పట్టాయి. దీంతో ప్రభుత్వం ఐదు ప్రత్యేక మిలిటరీ హెలికాప్టర్ల ద్వారా వారందరికి, భోజనవసతి కల్పించడంతో పాటు వారందరిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అక్కడ ఉన్నవారంతా క్షేమంగా ఉన్నట్లు ఫోన్‌ల ద్వారా నెల్లూరులో ఉన్న బంధువులకు సమాచారం అందింది. ఈ మేరకు ఫోన్‌లో మాట్లాడుతున్నారు. ఉత్తరకాశీ తీర్థయాత్రకు రావూస్ ట్రావెల్స్ ద్వారా 52మంది యాత్రికులు వెళ్ళగా 43మంది సురక్షితంగా నెల్లూరు చేరుకున్నారు. మిగిలిన 9మంది ఉత్తరకాశీలోని శివహోం హోటల్లో ఉన్నట్లు తెలుస్తోంది. వీరితో జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, ఎస్పీ రమణకుమార్ ఫోన్‌లో మాట్లాడారు.

## నెల్లూరులో తొలి లగ్జరీ లే అవుట్

# ఆదిత్య ఎలిగ్జిర్



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి, సి.వి.శేషారెడ్డి, వై.వి.రామిరెడ్డి తదితరులు

ఈమధ్యకాలంలో నెల్లూరులో వస్తున్న ఆధునిక చైతన్యాన్ని గమనిస్తే నెల్లూరు మహానగరాల సరసన చేరుతోందనడంలో సందేహం లేదు! ఇప్పటికే మల్టీప్లెక్స్‌ల సంస్కృతి విస్తరిస్తుండగా, తాజాగా బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి మహానగరాలకు పరిమితమైన అత్యద్భుతమైన హౌసింగ్ ప్రాజెక్టులు నెల్లూరులో సైతం నెలకొంటున్నాయి. ఈ దిశగానే వెంకటాచలం మండలం అనుపల్లిపాడు వద్ద, కృష్ణపట్నం పోర్టు కొత్తరోడ్డు ప్రక్కన నిర్మించిన ఆదిత్యా ఎలిగ్జిర్ లే అవుట్ సకల సదుపాయాలతో రూపుదిద్దుకుంది. ఈ లే అవుట్‌లోకి వెళితే బెంగుళూరు సిటీలోని ప్రెస్టేజ్ వంటి ప్రతిష్ఠాత్మకమైన హౌసింగ్‌ప్రాజెక్టులను చూసినట్లుగా వుంటుంది. ఇప్పటివరకు నెల్లూరులో రియల్టర్లు వివిధ సౌకర్యాలను బ్రోచర్‌లలో చెప్పడం తప్పించి, ఆచరణలో చేసి చూపించివుండరు. కాని ఆదిత్య ఎలిగ్జిర్‌లో మాత్రం నూటికి నూరుశాతం చెప్పినవన్నీ చేసి చూపిస్తున్నారు. క్లబ్‌హౌస్, స్విమ్మింగ్ పూల్, పార్క్, డ్రైనేజీ, అత్యాధునిక లైటింగ్, టెన్నిస్‌కోర్టు, షటిల్‌కోర్టు, టేబుల్‌టెన్నిస్, కమ్యూనిటీహాల్, జిమ్ వంటి ఎన్నో వసతులతో ఈ లే అవుట్ అత్యంత సుందరంగా రూపుదిద్దుకుంది. నెల్లూరీయులు ఒక్కసారైనా చూసి రావాలనిపించేలా లేఅవుట్‌ను తయారు చేసారు. ఈ లే అవుట్‌ను సర్వేపల్లి శాసనసభ్యులు ఆదాల ప్రభాకరరెడ్డి బుధవారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ నెల్లూరులో మొట్టమొదటిసారిగా రెసిడెన్షియల్ గేటెడ్ కమ్యూనిటీ టౌన్‌షిప్‌గా ఆదిత్యను పేర్కొన్నారు. జాతీయ రహదారి నుంచి కేవలం కిలోమీటరు దూరంలో 70ఎకరాల్లో ఏర్పాటుచేసిన లే అవుట్‌లో అన్ని వసతులున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైవీ రామిరెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, సీవీ శేషారెడ్డి, బాలకృష్ణారెడ్డి, రఘునందనరెడ్డి, కోదండరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మధురం.. సుమధురం... ఆమె గానం!

## శ్రీమతి బాలార్కను కీర్తించిన అభిమానులు




బాలార్క - భాస్కర్ దంపతులను సత్కరిస్తున్న ఏజేసీ సిహెచ్. పెంచలరెడ్డి, తుంగా శివప్రభాత్‌రెడ్డి, బలరామయ్యనాయుడు, వాకాటి విజయకుమార్‌రెడ్డి, వి.హాజరత్‌బాబు, బి.వి.నరసింహం

అమెరికాలో మే 23, 24, 25వతేదీలలో జరిగిన "తానా"(తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా) 19వ ద్వైవార్షిక సభలతో పాటు డాలస్ నగరంలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో జరిగిన బ్రహ్మోత్సవాలలో పాల్గొని తన గానామృతంతో అక్కడి తెలుగు వారిని పులకింపజేసి వచ్చిన ప్రముఖ శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు శ్రీమతి బాలార్కకు ఆమె అభిమానులు ఆత్మీయ అభినందన సభ ఏర్పాటుచేశారు.

సింహపురి సుస్వరాలు, విక్రమ సింహపురి సంగీత సభ, కళాంజలి సంస్థల సంయుక్త సారథ్యంలో జూన్ 16వతేదీ ఆదివారం నెల్లూరు పురమందిరంలో జరిగిన ఈ కార్యక్రమాలలో అదనపు జాయింట్ కలెక్టర్ చల్లా పెంచలరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ప్రతిభ వున్న చోటే గుర్తింపు వుంటుందని, మంచి ఆదరణ లభిస్తుందని తన సంగీత సామర్థ్యంతో అమెరికాలోని తెలుగువారిని అలరించి వచ్చిన బాలార్క నెల్లూరుకీర్తిని పెంచిందని పెంచలరెడ్డి అన్నారు. భవిష్యత్‌లో ఆమె ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.

విక్రమ సింహపురి సంగీతసభ, సింహపురి సుస్వరాలు సంస్థల అధ్యక్షుడు వాకాటి విజయకుమార్‌రెడ్డి బాలార్కను అభినందిస్తూ ఇప్పటి వరకు వందల సంఖ్యలో శ్రీవారి కళ్యాణోత్సవాలలో కచ్చేరి చేసిన బాలార్కను సాక్షాత్తు ఆ తిరుమలేశుడే అమెరికాకి సైతం పిలిపించుకుని ఆమె సంగీతాన్ని ఆస్వాదించాడని అన్నారు. ఎక్కడ స్వామి వారి కల్యాణం జరిగినా స్వచ్ఛందంగా ముందుకొచ్చి స్వామివారికి తన స్వరనీరాజనాన్ని సమర్పిస్తున్న బాలార్క అభినందనీయురాలన్నారు.

దాదాపు యాభై వేల మంది సభ్యులున్న ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్(ఐఎఎన్‌టి) వారు బాలార్క ప్రతిభకు గుర్తుగా ఆమెను "సంకీర్తనా కోకిల" బిరుదుతో సత్కరించడం గొప్ప విషయమని 'లాయర్' పత్రిక సంగ్రాహకుడు ప్రభు అన్నారు. బాలార్కకు అమెరికా దేశంలో అద్భుత అవకాశాలు రావడానికి ఆమె ప్రతిభే కారణమని చెప్పారు.

మురళీకృష్ణ హోటల్స్ సారథి వీరిశెట్టి హజరత్ బాబు ప్రసంగిస్తూ "బాలార్క" ప్రతిభకు తగిన గుర్తింపుగా ఆమె విదేశీ పర్యటన సాగడం నెల్లూరీయులందరికీ గర్వకారణమన్నారు.

సభను నిర్వహించిన సహస్రసభాసింహం బి.వి.నరసింహం స్వాగతోపన్యాసంలో ఇంటర్నెట్ ద్వారా ప్రపంచంలోని పలు దేశాలలో వున్న సంగీత ప్రియులకు క్లాసులు నిర్వహిస్తున్న ఘనత శ్రీమతి బాలార్కదని ప్రశంసించారు.



బాలార్కను సత్కరిస్తున్న కావలి 'సద్భావన-సాధన' కమిటీ సభ్యులు జి.మారుతి, సుబ్బారావు, సాయిశ్రీధర్

కళాంజలి అనంత్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో సభ నిర్వాహకులతో పాటు బాలార్క అభిమానులు అనేక మంది పాల్గొని ఆమెని అభినందన సత్కారంతో ముంచెత్తారు. తనకు లభించిన ఈ అవకాశం వెనుక తన అమెరికా యాత్ర కోసం కృషిచేసిన కోర్నపాటి శ్రీధర్‌రెడ్డితో పాటు తనకు సహకారాన్ని ప్రోత్సాహాన్ని అందించిన వారందరికి బాలార్క పేరు పేరునా కృతజ్ఞతలను తెలియజేశారు. ముఖ్యంగా తనని వెన్నంటి నడిపిస్తున్న తన భర్త భాస్కర్, అత్తమామలు, అమ్మానాన్నలను, తన ఈనాటి ఈ స్థాయికి స్ఫూర్తిదాతలు తన అమ్మమ్మ తాతయ్యలందరికీ ఆమె రుణపడివుంటానని అన్నారు.



అభినందన కార్యక్రమానికి ముందుగా శ్రీమతి బాలార్క శిష్య బృందంచే దాదాపు గంట సేపు అన్నమాచార్య సంకీర్తనాలాపన జరిగింది.

బి.వి.నరసింహంతో పాటు "కళాంజలి" అనంత్ నలుబోలు బలరామయ్యనాయుడు, క్లాసిక్ గ్రాఫిక్స్ విష్ణు, బెనర్జీ తదితరుల సహాయసహకారాలతో కార్యక్రమం ఆసాంతం ఆహ్లాదంగా ఆనంద భరితంగా ఆత్మీయ సంబరంగా జరిగింది.

PDF Compressor Free Version






## మోడీకే జై అంటున్నాయి

దేశంలో అన్ని సర్వేలు నరేంద్ర మోడీకే జై అంటున్నాయి. మోడీని ప్రధానిని చేస్తేనే ప్రజలు బీజేపీకి ఓట్లేసే పరిస్థితి. ఉపఎన్నికలలో గుజరాత్‌లో బీజేపీ క్లీన్‌స్వీప్ చేసింది. బీహార్‌లో నితీష్ ఓడిపోయాడు. యూపిఏ ప్రభుత్వం దేశ ప్రతిష్టను దిగజార్చింది. మేధావులు, యువత, దేశభక్తులంతా మోడీకి మద్దతు ప్రకటించాలి. మోడీ నాయకత్వంలో బీజేపీకి 250సీట్లు ఖాయం.

వాస్తు రామచంద్ర,
నెల్లూరు.

## ప్రజలను స్థిమితంగా ఉండనీయండి

ప్రజలను తికమక పెట్టేందుకు ప్రతి విషయానికి కమిటీలు, కమీషన్‌లు వేసి కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారు. ఈ కమిటీలు రిపోర్టులు ఇచ్చినా వాటిని అమలు చేయరు. ఈ కమిటీలవల్ల నిందితులు క్లీన్‌చిట్‌లు పొందుతూ దర్జాగా వుంటున్నారు. మైనార్టీలకు ప్రత్యేకంగా 5యూనివర్శిటీలను ఏర్పాటు చేయబూనడం వచ్చే ఎన్నికలలో మైనార్టీల ఓట్ల కోసమే. ఇక కులాలవారీగా యూనివర్శిటీలను కోరవచ్చు. బుర్రలేని ప్రధానమంత్రితోనే ఈ తలనొప్పులన్నీ వస్తున్నాయి.

ఎన్. రామచంద్రారెడ్డి, చెన్నై.

## మాగుంట శీనయ్య ఎంపిక పట్ల హర్షం

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటి కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా నెల్లూరీయుడు, ఒంగోలు లోక్‌సభ సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి ఎంపిక హర్షణీయం. స్వర్గీయ మాగుంట సుబ్బరామిరెడ్డి రాజకీయ వారసునిగా రాజకీయ రంగప్రవేశం చేసి ఒంగోలు ఎంపిగా సుదీర్ఘకాలం పనిచేసిన శీనయ్య వివాదరహితుడు. కాంగ్రెస్ పార్టీలో గ్రూపులకు, వర్గాలకు అతీతంగా తన పనేదో తాను చేసుకుంటూ తన నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో వుంటూ ప్రజాసేవ చేస్తూ సుబ్బరామిరెడ్డి పేరు నిలబెడుతున్న శీనయ్య ఎంపిక మాగుంట అభిమానులందరికీ ఎంతో ఆనందాయకం. ఈ పదవికి ఎంపిక కాబడిన మాగుంట శ్రీనివాసులురెడ్డికి అభినందనలు.

ఎస్.బి.రావు, కావలి.

## 'ప్రభా'తం

గెలుపులోనూ, ఓటమిలోనూ కలిసికట్టుగా సాగిన బీజేపీ, జెడి(యు)ల బంధం విచ్ఛిన్నమైంది. కేంద్రంలో అధికారంపై బీజేపీ గంపెడాశలు పెట్టుకున్న సమయంలో ఆ ఆశలకు గండికొడుతూ ఎన్డీఏ నుండి జెడి(యు) వైదొలిగింది. బీజేపీ ప్రచార సారథిగా నరేంద్ర మోడీ నియామకాన్ని జీర్ణించుకోలేక దళ్(యు), ఆ చర్యకు నిరసనగానే బీజేపీకి రాంరాం చెప్పింది. దీంతో 2014లో అధికారం గురించి కలలుగంటున్న బీజేపీకి ఆదిలోనే హంసపాదు అన్నట్లయ్యింది.

ఇంతకాలం ఎన్డీఏలో దళ్(యు) ఒక నమ్మకమైన మిత్రపక్షంగా వుండింది. 1998 నుండి కూడా బీజేపీతో కలిసే దళ్(యు) ఎన్డీఏలో కొనసాగుతూ వచ్చింది. 1998 నుండి కూడా ఎన్డీఏ నుండి అన్నాడిఎంకె, ఆ తర్వాత డిఎంకె, బిజుజనతాదళ్, తృణమూల్‌కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ వంటి పార్టీలు వైదొలుగుతూ వచ్చాయి. ఇన్ని పార్టీలు వదిలివెళ్లినా, వరుసగా 2004, 2009లలో ఎన్డీఏ పరాజయం పాలైనా దళ్(యు) బీజేపీతోనే కలిసి నడిచింది. బీజేపీ తర్వాత కూటమిలో దళ్(యు) రెండో పెద్దపార్టీగా వుండింది.

మూడేళ్ల క్రితం నుండి బీజేపీ, దళ్(యు) నేతల మధ్య మనస్పర్థలు రేగాయి. దీనికి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ వేదికయ్యారు. 2002 గుజరాత్ అల్లర్లలో మోడీ పాత్రను దళ్(యు) నేతలు వ్యతిరేకిస్తూ వచ్చారు. కాగా మూడేళ్ల క్రితం బీహార్‌లో వరదబాధితులను ఆదుకోవడానికి నరేంద్ర మోడీ గుజరాత్ తరపున ఆర్థికసాయం అందించారు. అంతవరకు బాగానే వుంది. అయితే తాను చెక్కు ఇస్తుంటే నితీష్‌కుమార్ తీసుకుంటున్న ఫోటోను మోడీ పత్రికా ప్రకటనలలో ముద్రించడాన్ని నితీష్‌కుమార్ సహించలేక పోయారు. మేమేం భిక్షం ఎత్తుకోవడం లేదంటూ గుజరాత్ ఆర్థికసాయాన్ని వెనక్కి పంపించారు. అప్పటి నుండి కూడా బీజేపీతో స్నేహంగానే వున్నా నరేంద్ర మోడీ విషయంలో మాత్రం దళ్(యు) వైఖరి మారింది. మోడీ, నితీష్‌ల వ్యవహారం ఎంతదాకా ముదిరిందంటే, మూడోసారి మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తుంటే ఎన్డీఏ ముఖ్యమంత్రులంతా వచ్చారు. కాని నితీష్ రాలేదు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ముఖ్యమంత్రుల సదస్సులోనూ పీల్లిద్దరూ ఎడమొగం, పెడమొగంగానే వున్నారు. కనీసం మర్యాదపూర్వకంగా కూడా పలుకరించుకోలేదు.

ఇక బీజేపీ ప్రధానమంత్రి అభ్యర్థిగా మోడీ పేరు చాలాకాలం నుండే ప్రచారంలో వుంది. ఇది దళ్(యు)కు మింగుడు పడడంలేదు. అందుకే బీజేపీ ఎవరిని ప్రకటించుకున్నా, ప్రధానమంత్రి అభ్యర్థిని నిర్ణయించేది మాత్రం ఎన్డీఏ కూటమేనని చెబుతూ వస్తుంది. పలు సందర్భాలలో బీజేపీ తన ప్రధాని అభ్యర్థిని ప్రకటించాలని కూడా కోరుతూ వచ్చింది. అలాచేస్తే తమ నిర్ణయమేంటో తీసుకోవచ్చనేది వారి ఉద్దేశ్యం.

గోవాలో జరిగిన బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశంలో నరేంద్ర మోడీని ఎన్నికల ప్రచార సారథిగా నియమించడం దళ్(యు) నేతలకు రుచించలేదు. ఇక్కడ వాస్తవంగా తీసుకుంటే మోడీని బీజేపీ పార్టీ ఎన్నికల ప్రచారసారథిగా నియమించారే గాని, ఎన్డీఏ ప్రచార సారథిగా కాదు. ఇది పూర్తిగా ఆ పార్టీ అంతర్గత వ్యవహారం. మోడీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించివుంటే దళ్(యు) ఈ నిర్ణయం తీసుకోవడంలో తప్పులేదు. రేపు ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. నరేంద్ర మోడీ ప్రచారం వల్ల బీజేపీకి సీట్లు పెరగొచ్చు. అయితే పూర్తి మెజార్టీ అసాధ్యం. అలాంటప్పుడు ప్రధాని అభ్యర్థిని నిర్ణయించే కీలకపాత్ర దళ్(యు)దే అయ్యుండేది. వారికి ఆమోదయోగ్యమైన వాళ్లే ప్రధానిగా తెరమీదకు వచ్చుండేవాళ్లు. అంతే కాదు రామరథయాత్రతో దేశమంతా మతఘర్షణలు చెలరేగడానికి కారకుడు అద్వానీ. దేశంలో ఒక్క గుజరాత్‌లోనే మతఘర్షణలు జరగలేదు. ప్రతిరాష్ట్రంలోనూ జరిగాయి. అద్వానీ ప్రధాని అయితే నితీష్‌కు అభ్యంతరం లేనప్పుడు మరి మోడీ విషయంలో అభ్యంతరం ఎందుకొచ్చిందో ఆయనకే తెలియాలి! ఏదేమైనా కేంద్రంలో యూపిఏకు వ్యతిరేకంగా ఎన్డీఏ బలమైన శక్తిగా అవతరిస్తున్న తరుణంలో దళ్(యు) నిర్ణయం దానికి శరాఘాతంగా మారింది.

### తెగదెంపులు



బీజేపీతో కలిసి సుదీర్ఘకాలంపాటు ప్రయాణించిన జెడి(యు) ఎన్‌డిఏ నుండి వైదొలగడానికి చెబుతున్న కారణాలు మాత్రం సహేతుకం కాదు. రామరథయాత్రతో దేశ మంతటా మతకల్లోలాలు రేగడానికి కారణమైన అద్వానీని ఆమోదించిన నితీష్‌కు మోడీ విషయంలో అభ్యంతరాలెందుకో అర్థంకావడం లేదు.

దళ్(యు) ఎన్డీఏ నుండి వైదొలగడంతో బీహార్‌లో సైతం రాజకీయ వాతావరణం మారింది. బీజేపీ మంత్రులను తన కేబినెట్ నుండి నితీష్ తొలగించారు. బీహార్‌లో బీజేపీ మద్దతు లేకున్నా స్వతంత్రుల మద్దతుతో ప్రభుత్వం నిలిచే అవకాశముండడంతో నితీష్ తెగదెంపులకు తెగువచూపారు.

నితీష్ చర్యను బీజేపీ సవాల్‌గా తీసుకుంది. బీహార్‌లో ఇక బలమైన శక్తిగా ఎదిగి నితీష్‌కు తామేంటో చూపాలనే పంతంతో ఆ రాష్ట్ర బీజేపీ నాయకులున్నారు. బీహార్‌లో లాలును మట్టికరిపించడానికి దళ్(యు), బీజేపీలు ఎంతగానో శ్రమించాయి. ఈ కూటమి సక్సెస్ కాబట్టే వరుసగా రెండుసార్లు బీహార్‌లో అధికారాన్ని చేజిక్కించుకోగలిగారు. రేపు లాలూ వ్యతిరేక ఓటు చీలిపోయే అవకాశముంది. ఇది రెండుపార్టీలకు కూడా నష్టం కలిగించడం ఖాయం.

దళ్(యు)ను తమ బుట్టలోకి లాగేందుకు యూపిఏ సన్నాహాలు చేస్తుంది. ఇదే జరిగితే దళ్(యు) పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్లే! మతతత్వ పార్టీని వదిలి అత్యంత అవినీతి పార్టీతో అంటుకాగినట్లు వుంది.

తాజా పరిణామాలతో మూడో కూటమి ఏర్పాటుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. దళ్(యు) బయటకు రావడంతో ఆ పార్టీలో కలిసి వామపక్షాలు, సమాజ్‌వాదీ, బిజూజనతాదళ్, తృణమూల్‌కాంగ్రెస్, తెలుగుదేశం వంటి ప్రాంతీయపార్టీలన్నీ కొత్త వేదిక నిర్మాణానికి శ్రీకారం చుట్టాయి.

## 'అంతర్'జాతీయం

- ఇరాన్ కొత్త అధ్యక్షుడిగా మితవాద మత గురువు హసన్‌రోహానీ ఎన్నికయ్యారు. రోహానీ గెలుపుతో 8ఏళ్లుగా సాగిన ఛాందసవాదుల పాలనకు తెరపడినట్లయ్యింది.
- ఐక్యరాజ్యసమితి సాధారణ అసెంబ్లీ అధ్యక్షునిగా జాన్‌విలియం ఆషే ఎన్నికయ్యారు.
- పాకిస్థాన్‌లోని క్వెట్టా పట్టణంలో 15వ తేదీ మిలిటెంట్లు సర్దార్ బహదూర్‌ఖాన్ మహిళా యూనివర్శిటీకి చెందిన బస్సును పేల్చివేసిన సంఘటనలో 23మంది మరణించారు. వీరిలో 14మంది విద్యార్థినులున్నారు.
- ఎయిర్ ఏషియా భారత విభాగం డైరక్టర్ల బోర్డుకు రతన్ టాటా ప్రధాన సలహాదారుగా నియమితులయ్యారు. రతన్‌టాటాకున్న అపారమైన అనుభవం తమ సంస్థకెంతగానో ఉపయోగపడుతుందని, ఆయనను ఎయిర్ ఏషియా కుటుంబంలోకి ఆహ్వానిస్తున్నామని కంపెనీ చీఫ్ టోనీ ఫెర్నాండెజ్ పేర్కొన్నారు.
- రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి కార్యాలయాలను ఆర్టీఐ పరిధిలోకి తీసుకొస్తూ కేంద్ర ప్రభుత్వం కీలకనిర్ణయం తీసుకుంది. వీటికి సంబంధించిన సమాచారాన్ని ఈ ఫైలింగ్ ద్వారా దరఖాస్తు చేసి పొందవచ్చు.
- రాజ్యసభ సభ్యుడిగా మన్మోహన్‌సింగ్(80) 17వతేదీ ప్రమాణస్వీకారం చేసారు. అస్సాం నుండి ఆయన వరుసగా 5వసారి రాజ్యసభకు ఎన్నిక కావడం గమనార్హం.
- కేంద్రమంత్రివర్గాన్ని మన్మోహన్‌సింగ్ 17వ తేదీ విస్తరించారు. కొత్తగా 8మందికి స్థానం కల్పించారు. శీష్‌రాంఓలా, గిరిజావ్యాస్, ఆస్కార్ ఫెర్నాండేజ్, కావూరి సాంబశివరావు, జె.డి.శీలం, మాణిక్‌రావ్ గవిట్, సంతోష్‌చౌదరి, ఇఎస్ఎస్ నాచియప్పన్ కొత్తమంత్రులుగా కొలువుదీరారు.
- సౌదీఅరేబియాలో వీసా కాలపరిమితి దాటిన భారతీయులు వుండరాదని రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం హెచ్చరించింది. అటువంటి వారు తక్షణం సౌదీని విడిచి వెళ్లాలని సూచించింది.
- అమెరికాలో సుప్రీంకోర్టు తర్వాత అత్యంత శక్తివంతమైన న్యాయస్థానం జడ్జిగా భారతీయఅమెరికన్ శ్రీనివాసన్(46) 18వతేదీ ప్రమాణస్వీకారం చేసారు. ఛండీగఢ్‌లో జన్మించిన ఆయన ఇటీవలే అమెరికా అప్పీళ్లకోర్టు న్యాయమూర్తిగా ఎన్నికయ్యారు. ఈ ఘనత సాధించిన తొలి భారతీయఅమెరికన్ శ్రీనివాసన్ కావడం గమనార్హం.

## వార్త వ్యాఖ్య

వార్త :- మరుగుదొడ్లు వున్న ఇంటికే కోడలిగా వెళ్లండి.
– కేంద్రమంత్రి దాసరి జైరాంరమేష్.
వ్యాఖ్య :- *మరుగుదొడ్డికయ్యే ఖర్చు కూడా కట్నం క్రింద తెమ్మంటారేమో?*

వార్త :- పదవీవిరమణ పెంపు యోచన లేదు. – కేంద్రం.
వ్యాఖ్య :- *ఉద్యోగులకా? ప్రధానికా?*

వార్త :- కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడిస్తాం. – మందా కృష్ణ.
వ్యాఖ్య :- *మీరు చెప్పకున్నా రేపు జరిగేవని అదేలే!*

వార్త :- రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌గా దిగ్విజయ్.
వ్యాఖ్య :- *ఒకరే ఎక్కువ కాలం వుంటే పిచ్చిపడుతుందనా?*

వార్త :- మేమూ త్యాగాలకు సిద్ధపడుతున్నాం. – తెలంగాణపై జానారెడ్డి.
వ్యాఖ్య :- *తెలంగాణను వదులుకుంటారా...?*

వార్త :- తెలంగాణకు ప్యాకేజీలు శాశ్వత పరిష్కారం కాదు. – బీజేపీ.
వ్యాఖ్య :- *తాత్కాలికంగా సర్దుకుంటుందంటారు.*

వార్త :- మళ్లీ పేలిన పెట్రోబాంబు.
వ్యాఖ్య :- *ఆ బాంబులు పేలుతూనే వుంటాయిలే...*

వార్త :- తిరుగులేని నాయకుడు రాహుల్. – ప్రధాని కితాబు.
వ్యాఖ్య :- *అలాకాదు... తిరిగే నాయకుడనండి.*

వార్త :- స్థానిక సంస్థల ఎన్నికలలోనూ విజయం మనదే!
– సీఎం కిరణ్ ధీమా.
వ్యాఖ్య :- *అవతలపార్టీలు అభ్యర్థులను పెట్టకుంటే!*

వార్త :- కాంగ్రెస్‌ను ప్రజలు సస్పెండ్ చేయడం ఖాయం. – కిషన్‌రెడ్డి.
వ్యాఖ్య :- *ప్రజలను కాంగ్రెస్సే సస్పెండ్ చేసేసింది లేండి!*

వార్త :- అద్వానీ నాయకత్వం వహిస్తే ఎన్డీఏలో చేరతాం. – శరద్‌యాదవ్.
వ్యాఖ్య :- *ఇదంతా అద్వానీ కోసం వచ్చిన తలనొప్పన్నమాట!*

వార్త :- రాష్ట్రవ్యాప్తంగా 40లక్షల భోగస్ ఓట్లు.
– ఎన్నికల ప్రధానాధికారి భన్వర్‌లాల్.
వ్యాఖ్య :- *తీసేస్తే అభ్యర్థులకు ఓటుకు వెయ్యి మిగిల్చిన వాళ్లవుతారు.*

PDF Compressor Free Version



# తేలని పంచాయితీ

గ్రామాలలో నాయకులు, కార్యకర్తలు పంచాయితీ పోరుకు సిద్ధంగా వున్నారు. గ్రామాలలో అసెంబ్లీ ఎన్నికలకంటే కూడా పంచాయితీ ఎన్నికలకు ప్రాధాన్యత ఎక్కువ. నాయకులు, వర్గాల సత్తా ఏంటో తెలిసేది ఇక్కడే! కాబట్టే ఎవరిని అభ్యర్థులుగా నిలబెట్టాలనే విషయమై ప్రతి గ్రామంలో నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఎన్ని ఓట్లున్నాయి. ఎన్ని నోట్లు కావాలి అని కాలిక్యులేటర్‌లు ముందేసుకుని లెక్కలు కూడా చూసుకుంటున్నారు. రేపోమాపో నోటిఫికేషన్ వెలువడుతుంది... ఈ నెలాఖరులోపు ఎన్నికలు జరగడం ఖాయం అనుకుంటున్న తరుణంలో ప్రభుత్వ నిర్వాకం వల్ల ఈ ఎన్నికలు ఇంకోసారి వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రిజర్వేషన్‌ల ఖరారులో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి పంచాయితీ ఎన్నికల ప్రక్రియకు బ్రేకులు వేస్తుంది. 2006లో జరిగిన పంచాయితీ ఎన్నికలలో జిల్లాను యూనిట్‌గా తీసుకుని ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్‌లను ఖరారు చేశారు. ఈసారి రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని మొదట రిజర్వేషన్‌లను ఖరారు చేయడం జరిగింది. అయితే కొంతమంది ఎమ్మెల్యేలు దీనిపై అభ్యంతరాలు లేవనెత్తారు. రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు ఖరారుచేస్తే ఎస్సీ ఓటర్లు అధికంగా వున్న తూర్పు గోదావరి వంటి జిల్లాలలో అధికశాతం పంచాయితీలను ఈ కేటగిరికే రిజర్వ్ చేయాల్సివుంటుంది. అప్పుడు జనరల్ కేటగిరి సీట్లు తగ్గిపోతాయి. బీసీ రిజర్వేషన్‌లకు జిల్లాను, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌లకు రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుంటే దీనిపై కొందరు కోర్టుకు పోయే అవకాశాలున్నాయి. అప్పుడు ఎన్నికలే ఆపు చేయాల్సి రావచ్చు. ఇక మొదట 2001 జనాభాలెక్కల ప్రకారం స్థానిక ఎన్నికలకు పోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు అధికార యంత్రాంగం పెద్దఎత్తున కుస్తీ పట్టి ఓటర్ల జాబితాలను సిద్ధం చేసింది. అయితే ప్రభుత్వం మళ్ళీ 2011 జనాభా లెక్కల ప్రకారం ఎన్నికలకు పోవాలని జిల్లా పంచాయితీ కార్యాలయాలకు ఆదేశాలు జారీ చేసింది. ఇంకేముంది అధికారులు ఆఘమేఘాల మీద ఈ జాబితాను కూడా రూపొందించారు. ఈ జాబితాలు ఎంత అవకతవకలతో రూపొందాయన్నది వేరే సంగతి. ఇక వార్డుల రిజర్వేషన్‌ల తంతులోనూ తప్పులు దొర్లాయి.

స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహిద్దామనే చిత్తశుద్ధి ప్రభుత్వంలో కనిపించడం లేదు. సంక్రాంతి పందెం కోళ్లలాగా పంచాయితీ ఎన్నికలకు సిద్ధమైన గ్రామ నాయకుల ఆశలపై ప్రభుత్వ చర్యలు నీళ్లు కుమ్మరించేలా వున్నాయి.

# వ్యభిచార కేంద్రం గుట్టురట్టు

## ఆరు మంది నిర్వాహకులు, ఏడుమంది సెక్స్‌వర్కర్లు అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న గూడూరు డీఎస్పీ చౌడేశ్వరి

నెల్లూరుజిల్లా గూడూరు పట్టణంలో ఇండ్ల నివాసాల మధ్య గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న హైటెక్ వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్న ఓ ముఠాగుట్టును గూడూరు పోలీసులు బుధవారం తెల్లవారుజామున ఛేధించారు. ఆరు మంది నిర్వాహకులతో పాటు, ఏడుమంది సెక్స్‌వర్కర్లను అదుపులోకి తీసుకున్నారు. బుధవారం సాయంత్రం నెల్లూరునగరంలోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో గూడూరు డీఎస్పీ చౌడేశ్వరి కేసు వివరాలను వెల్లడించారు. గూడూరు న్యూ ఇందిరానగర్‌లో తురకాసాయిరామ్, మాధవి దంపతులు, నెల్లూరుకు చెందిన బల్లి పద్మ, బల్లి ప్రవీణ్, గూడూరు పట్టణానికి చెందిన ఎస్.కె.అమ్ములు అక్రమ ముఠాసంఘంగా ఏర్పడి వ్యభిచార కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. నెల్లూరు, గుంతకల్, తిరుపతి, హైదరాబాద్, విశాఖపట్నం, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి యువతులను తీసుకొచ్చి వారిచే వ్యభిచారం చేయిస్తున్నారు. గూడూరు పట్టణానికి చెందిన బత్తల నాగరాజు అనే ఆటో డ్రైవరు సహాయంతో విటుల వద్దకు యువతులను పంపి సొమ్ము చేసుకునేవారు. కొంతకాలం వరకు గుట్టు చప్పుడు కాకుండా జరిగిపోతున్న వ్యవహారంపై పోలీసులకు సమాచారం రావడంతో గూడూరు పట్టణ సిఐ యు.సత్యనారాయణ, ఒకటవ, రెండవ పట్టణ ఎస్ఐలు ఎస్‌కె షరీఫ్, బి.అంకమరావు, బుధవారం తెల్లవారుజామున వ్యభిచారకేంద్రంపై దాడిచేసి నిర్వాహకులు, సెక్స్ వర్కర్లను పట్టుకుని వారిపై కేసులు నమోదు చేశారు. సెక్స్‌వర్కర్లకు అపాచిలో ఉపాధిని కల్పిస్తున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. హైటెక్ వ్యభిచార కేంద్రం గుట్టురట్టు చేసిన పట్టణ సిఐ, ఎస్ఐలను అభినందించారు. ఈ సమావేశంలో గూడూరు సిఐ యు.సత్యనారాయణ, ఎస్ఐలు ఎస్‌కె షరీఫ్ బి.అంకమరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# ముదిరిన ముఖ్యమంత్రి

(మొదటిపేజీ తరువాయి)

దగ్గర చేసుకున్నాడు. వై.యస్. పొడగిట్టని నాయకులు సైతం ఆయన సీఎం అయ్యాక ఆయనతో కలిసిపోయారు. కాని కిరణ్ ఆ పాలసీని అనుసరించలేదు. తనకు పడకుంటే పడేసి తొక్కడమే పనిగా పెట్టుకున్నాడు. అదే పనిగా అసమ్మతి రాగం ఆలపిస్తున్న పీసీసీ చీఫ్ బొత్సను మద్యం కేసులతో తొక్కిపడేసాడు. ఆయన జోడు పదవులకే ఎసరుతెచ్చే వాతావరణం కల్పించాడు. తెలంగాణ ఉద్యమాన్ని అణిచే విషయంలో చాలా కఠినంగా వ్యవహరించాడు. కిరణ్ మొండిగా వుండబట్టే కేంద్రం కూడా తెలంగాణ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోలేకపోతుంది. జగన్ ఆస్తుల కేసుల్లో ఇరుకున్న మంత్రులను పక్కకు తప్పించడంలోనూ, అదే కళంకిత మంత్రులను చట్టాల నుండి రక్షించడంలోనూ ఆయన తనదైన చాణక్యనీతిని ప్రదర్శిస్తున్నారు. తనకు వ్యతిరేకంగా నోరు విప్పిన డిఎల్ రవీంద్రరెడ్డిని అవమానకరంగా మంత్రివర్గం నుండి బయటకు పంపించాడు. ఇంకా తనకు పడని కొందరు మంత్రుల విషయంలోసైతం ఆయన చాలా మొండిగా వ్యవహరిస్తున్నారు. ఉదాహరణకు నెల్లూరుజిల్లానే తీసుకుంటే... మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో పడదు కాబట్టి జిల్లాలో ఆయన ప్రాబల్యాన్ని తగ్గించే ప్రయత్నాలు చేసారు. మంత్రి జిల్లా కలెక్టర్ శ్రీధర్ బదిలీకి ప్రయత్నిస్తుంటే ముఖ్యమంత్రి దానికి బ్రేకులు వేస్తున్నాడు. జిల్లా ఎస్పీ వ్యవహారంలోనూ ఈ ఇద్దరికీ పొసగడం లేదన్నది నగ్నసత్యం. ఇంకా తనకు పడని పలువురు మంత్రుల జిల్లాలలో ముఖ్యమంత్రే నేరుగా జోక్యం చేసుకుంటుండడం విశేషం.

2014ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కిరణ్ తెచ్చిన లేటెస్ట్ ఓట్ల పథకం 'బంగారు తల్లి'. దీనికి చట్టబద్ధత కల్పించడానికి కిరణ్ తీవ్రంగా కృషి చేసారు. దీని చట్టబద్ధతను పలువురు మంత్రులు వ్యతిరేకించినా కిరణ్ లెక్క చేయలేదు. ఇలా మొండితనంతోనే కిరణ్ కాంగ్రెస్‌పార్టీలో బలంగా పాతుకుపోయాడు. సీఎం కుర్చీలో పటిష్టంగా సెటిలయ్యాడు.

# సైనికుల్లా... సమాయత్తం కావాలి

- సురేష్‌రెడ్డి

పంచాయతీ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సైనికుల్లా సమాయత్తం కావాలని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో జిల్లా పదాధికారుల మండల ఇన్‌చార్జ్‌లు సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ మండల అధ్యక్షులు, మండల ఇన్‌చార్జ్‌లు పూర్తి బాధ్యత తీసుకుని మండల కేంద్రాల్లో విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. జూలై 14న జరిగే ప్రజాచైతన్య సదస్సుకు అన్ని వర్గాల ప్రజలు గ్రామాల నుంచి తరలివచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు కె.కోటేశ్వరరావు, కె.విజయలక్ష్మి, పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయ రెడ్డి కార్యవర్గ సభ్యులు మిడతల రమేష్, భాస్కరగౌడ్, దళితమోర్చా జిల్లా అధ్యక్షుడు ఎ.కె.జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్పీ హనుమంతరావుపై వేటు



నెల్లూరుజిల్లా గూడూరు డీఎస్పీగా పనిచేస్తూ బదిలీ అయిన టి.వి.హనుమంత రావును సస్పెండ్‌చేస్తూ డీజీపీ దినేష్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. క్రమ శిక్షణ చర్యల్లో భాగంగా ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు తెలుస్తోంది. మూడునెలలు మాత్రమే గూడూరులో పనిచేసిన ఆయనపై విమర్శలు రావడం ప్రధానంగా తప్పుడు సమాచారం ఇచ్చాడనే విషయంలో ఇప్పుడు ఆయనపై చర్య తీసుకున్నారు. ఈ ఏడాది జనవరి 23న బాధ్యతలు స్వీకరించిన హనుమంతరావును ఆకస్మికంగా ఏప్రిల్ 29న డిజిపి కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలు వచ్చాయి. గూడూరు డీఎస్పీగా హనుమంతరావు శాంతిభద్రతలు కాపాడటంలో విఫలమయ్యారని, అక్రమ రవాణాను అరికట్టలేకపోగా సహకరించారనే విమర్శలు ఎదుర్కొన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్ల నుంచి మామూళ్ళు పంపించాలని సిబ్బందిపై ఒత్తిడి తెచ్చినట్టు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో ఎస్పీ రమణకుమార్ మందలించినా వ్యవహారశైలి మార్చుకోకపోవడంతో హనుమంతరావుపై ఒక నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. తనపై చర్యలు ఉంటాయని మెడికల్ లీవ్‌లో వెళ్ళేందుకు హనుమంతరావు ప్రయత్నించారు. ఈ లోగానే డిజిపి కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలు వచ్చాయి. బదిలీ ఉత్తర్వులు స్వీకరించకుండా వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురయ్యానంటూ నెలాపదిహేను రోజులు సెలవుపై వెళ్ళారు. ఇలా తప్పుడు సమాచారం ఇచ్చారని ఉన్నతాధికారులు భావించి, తప్పుడు సమాచారం ఇవ్వడాన్ని సీరియస్‌గా పరిగణించి బుధవారం సస్పెండ్‌చేస్తూ డిజిపి ఆదేశాలు జారీ చేశారు.

# తెలంగాణ 'ప్యాక్'అప్

(మొదటిపేజీ తరువాయి)

పెద్దగా గొడవచేసే వాళ్లు లేరు. ఉన్న కేకే, వినోద్, మందా జగన్నాథంలాంటి వాళ్లు టీఆర్ఎస్‌లో చేరిపోయారు. ఇంకెవరూ తెలంగాణ గురించి పెద్దగా మాట్లాడక పోతుండడంతో అధిష్టానంపై కూడా అంతగా ఒత్తిడి లేదు. అదీగాక ఇప్పుడు తెలంగాణను ప్రకటిస్తే లేనిపోని సమస్యలను మెడకు చుట్టుకున్నట్లవుతుంది. దేశంలోని ఇంకా పలు రాష్ట్రాలలో ప్రత్యేక డిమాండ్లు లేస్తాయి. ఇక్కడ తెలంగాణ ఇచ్చిందంటే టీఆర్ఎస్, బీజేపీలు బలపడతాయి కాని కాంగ్రెస్‌కు ఏ మాత్రం ఉపయోగముండదు. అంతేకాక, సీమాంధ్రలో పూర్తిగా తుడిచిపెట్టుకుపోతుంది. ఇచ్చి ఉపయోగం లేనప్పుడు తెలంగాణ ఇవ్వడం దండగనే ధోరణిలో కాంగ్రెస్ అధిష్టానం వుంది.

ప్రధాని మన్మోహన్‌సింగ్ మొదటినుండి ప్రత్యేక తెలంగాణకు వ్యతిరేకంగానే వున్నారు. ఇక రాష్ట్ర గవర్నర్ నరసింహన్‌ది అదే బాట. ప్రత్యేక తెలంగాణ ఇస్తే మావోయిస్టుల రాజ్యం వస్తుందని ఆయన గతంలోనే కేంద్రానికి నివేదిక ఇచ్చివున్నారు. ఇప్పుడు కూడా ఆయన ప్రత్యేకరాష్ట్రంకంటే తెలంగాణకు ప్రత్యేకప్యాకేజీయే మేలని చెప్పినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో యూపిఏ ప్రభుత్వంలో తెలంగాణకు ప్యాకేజీలే ప్రాప్తం... ప్రత్యేకరాష్ట్రం కాదు.

# పసలేని విస్తరణ

(మొదటిపేజీ తరువాయి)

ఏలూరు నుండి పలుదఫాలు గెలిచారు. ఈ 9ఏళ్లలో తనకు మంత్రి పదవి దక్కనందుకు చాలాసార్లు అక్కసువెళ్లగక్కాడు. ఈసారి రాకపోయివుంటే పార్టీకి రాజీనామా చేసినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు. ఇక జె.డి.శీలంను దళితవర్గాల నుండి ఎంపిక చేసారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అయ్యుండడం ఆయనకు కలిసొచ్చింది. అయితే ఈ ఇద్దరికీ మంత్రిపదవులిచ్చినంత మాత్రాన రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీకి ఒరిగేదేమీ లేదు. ఇంకో ఏడాదికాలంలో ఈ మంత్రులు చించేదేమీ లేదు. ఇదో దండగమారి విస్తరణే!

# ఉరుముతున్న మెట్టుకూరు

(2వపేజీ తరువాయి)

రూపకల్పన చేస్తున్నారు. చిరంజీవిరెడ్డి సరుకున్న నాయకుడు. పట్టుదలతో పనిచేస్తాడు. తెగింపు వుంది. కలిగిరితో పాటు జలదంకి, కొండాపురం మండలాలలో పట్టువుంది. చిరంజీవిరెడ్డి సొంతంగా పోటీచేసే పనయితే వైసిపిలో వుంటూ మేకపాటి పట్ల అసంతృప్తితో వున్న నాయకులు, కార్యకర్తలంతా కూడా చిరంజీవిరెడ్డి వైపు వెళ్లే అవకాశముంది. చిరంజీవిరెడ్డి స్వతంత్రంగా బరిలో దిగితే మాత్రం మేకపాటికి భారీబొక్క ఖాయం.

# రేగుతున్న మంటలు

(2వపేజీ తరువాయి)

వచ్చిపడ్డాడు. ఇక్కడితో ఆయన నాయకత్వం మీద కార్యకర్తలకు ఆశలు సన్నగిల్లాయి. అప్పటికే కాంగ్రెస్‌లో వున్న నాయకులు ఆయనకు వ్యతిరేకవర్గంగా ఏర్పడ్డారు. వైసిపిలోకి పోయి వచ్చిన విష్ణు నాయకత్వంలో పనిచేసేది లేదని కొందరు నాయకులు తేల్చిచెప్పారు. ఇక్కడ కొందరు నాయకులు, కార్యకర్తలు మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఆయన నాయకత్వంలోనే పనిచేస్తున్నారు. దీనివల్ల పార్టీ వ్యవహారాలలో మంత్రి తలదూర్చాల్సి వస్తుంది. ఇది విష్ణుకు మింగుడుపడక అసంతో గోక్కుంటున్నాడు.

ఫంగస్, చేపల
రైతులకు గొప్ప అవకాశం
చేపల మేత 1 Kg. రూ. 22
(పెల్లెట్) ప్రోటీన్ 23%
జాబ్‌వర్క్ కూడా చేయబడును
గోల్డెన్ ఫీడ్స్ పెద్దపడుగుపాడు నెల్లూరు.
సం. 08622-258596
9440279762

PDF Compressor Free Version





ఈ నెల 15వ తేదీ నెల్లూరు బి.వి.నగర్‌లోని కె.ఎన్.ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన సమూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో చిన్నారుల చేత ఓనమాలు దిద్దిస్తున్న నెల్లూరునగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి. పక్కన యం.జె.బ్రదర్స్ అధినేత యం.ఆర్.గంగాధర్, రాజీవ్‌విద్యామిషన్ ప్రాజెక్ట్ అధికారి డి.కోదండరామిరెడ్డి.



నెల్లూరు కబుర్లు

# చంద్రబాబు రావచ్చు

వచ్చే నెలలో తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు నెల్లూరుకు వచ్చే అవకాశాలున్నాయి. మనీస్కీం బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ తెలుగుయువత ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జరిగే భారీ ఆందోళనలో ఆయన పాల్గొనే అవకాశాలున్నాయి. మనీస్కీం అనేది చాలాపెద్ద స్కాం. జిల్లాలోనే 2లక్షల మంది దాకా బాధితులున్నారు. పలు కంపెనీల మనీస్కీం నిర్వాహకులను పోలీసులు అరెస్ట్ చేసి 53కోట్ల వరకు నగదు స్వాధీనం చేసుకున్నారుగాని బాధితులకు ఇంతవరకు ఒక్కరూపాయి కూడా చెల్లించలేదు. బాధితుల గురించి మనీస్కీం వ్యతిరేకపోరాటకమిటీ వాళ్ళు తప్పితే ఏ రాజకీయపార్టీ పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో తెలుగు యువత మనీస్కీం బాధితుల తరపున పోరాటానికి శ్రీకారం చుట్టింది.

# మళ్ళీ ముదిరిన ఎండలు



నైరుతి ఋతు పవనాలు చుట్టం చూపుగా వచ్చి వెళ్ళాయి. నాలుగురోజులు తొలకరి జల్లులు పలుకరించాయి. మబ్బులు అలా తొలిగిపోయాయో లేదో మళ్ళీ ఎండలు విజృంభిస్తున్నాయి. రెండు వారాల పాటు చల్లబడివున్న వాతావరణం మళ్ళీ వేడెక్కింది. ఎండలు మళ్ళీ మండుతున్నాయి. ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరిగాయి. జిల్లాలో సెకండ్ సమ్మర్ మొదలైనట్లుగా వుంది.

# ఆటోలపై పోలీసు పంజా

- గుర్తింపుకార్డులున్న వారే రాత్రిపూట ఆటోలు నడపాలి
- బయట నుంచి వచ్చే ఆటోలు నిషేధం



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి

డ్రైవర్ల ముసుగులో కొందరు రాత్రివేళల్లో ఆటోల్లో ప్రయాణించే ప్రయాణీకులపై చోరీలు, దోపిడీలకు పాల్పడుతున్నారని, ఇక నుంచి గుర్తింపుకార్డులు ఉన్నవారే ఆటోలను రాత్రివేళల్లో నడపాలని, ఇతర ప్రాంతాల నుంచి నగరంలోకి వచ్చే ఆటోలను అనుమతించేదిలేదని నెల్లూరు నగర, రూరల్ డీఎస్పీలు వెంకటనాథ్‌రెడ్డి, బాలవెంకటేశ్వరావులు స్పష్టంచేశారు. ఆదివారం ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్‌హాలులో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీలు మాట్లాడుతూ డ్రైవర్ల ముసుగులో కొంత మంది చేసే చోరీలు, దోపిడీలు ఆటో డ్రైవర్లపై పడుతుందని, ఆటో రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, ఇద్దరు మధ్యవర్తులతో ఆటోడ్రైవర్లు పోలీసులను సంప్రదించాలన్నారు. ప్రతి ఆటో యజమాని తప్పనిసరిగా పోలీసు నెంబరును తీసుకోవాలన్నారు.

ఇతర ప్రాంతాల నుంచి నగరంలోకి వచ్చే వాహనాలను ఇకపై అనుమతించేదిలేదని డీఎస్పీలు స్పష్టంచేసారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు వైపు నుంచి వచ్చే వాహనాలు నవాబుపేట, ముత్తుకూరు నుంచి వచ్చే వాహనాలు, హరనాథపురం, వెంకటాచలం నుంచి వచ్చే వాహనాలు, బుజబుజనెల్లూరు, ఆమంచర్ల నుంచి వచ్చే వాహనాలు తెలుగు గంగకాలనీ, జొన్నవాడ నుంచి వచ్చే వాహనాలు ఇరుకళల పరమేశ్వరి గుడి వరకు మాత్రమే అనుమతిస్తామన్నారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ సిఐలు ఎం.వెంకటేశ్వర్లు, ఎన్.సురేష్‌కుమార్‌రెడ్డి, రెండవ, ఆరవనగర సిఐలు ఎస్.కోటారెడ్డి, జి.మంగారావు, ట్రాఫిక్ ఎస్సైలు పాల్గొన్నారు.

# 'పట్టన్న'కు రోటరీక్లబ్ ఘన నివాళి



పట్టాభిరామిరెడ్డికి నివాళులర్పిస్తున్న రోటరీ సభ్యులు

స్వార్థం లేని దానం స్వర్గానికి సోపానం అని ఆర్యోక్తి. అటువంటి నిస్వార్థ దానపరాయణులు ఒకప్పుడు నెల్లూరులో అధికమే. వారిలో అగ్రగణ్యులుగా కీ॥శే॥ ఏనుగు పట్టాభి రామిరెడ్డిని పేర్కొనాలి. అయితే మనం వారిని ఎప్పుడో మరిచిపోయాం అని చెప్పొచ్చు. ఎందుకంటే వారిని కనీసం గుర్తుకు తెచ్చుకునే జయంతి, వర్ధంతులు కూడా సరిగా జరపడం లేదన్నది నిజం. అయితే ఈనెల 17న వదాన్యులు ఏనుగు పట్టాభిరామిరెడ్డి జయంతి సందర్భంగా నెల్లూరు రోటరీక్లబ్ వారు సుబేదారుపేటలోని ఆయన విగ్రహానికి పుష్పమాల వేసి హృదయపూర్వకంగా నివాళులర్పించడం సంతోషకరమైన విషయం. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షులు కె.మధుసూదన్‌రావు మాట్లాడుతూ పట్టాభిరామిరెడ్డి తన యావదాస్తిని రోటరీక్లబ్‌కు విరాళంగా ఇచ్చారని, ఉచిత వైద్యశాల, నేత్ర వైద్యశాలలు ఆయన దాతృత్వంతోనే రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కె.వి.సుబ్రహ్మణ్యం, రాఘవేంద్రషెట్టి, టీ.శేఖర్, ప్రతాప్‌కుమార్, రామకృష్ణారెడ్డి, డా॥ దొరస్వామినాయుడు, బాలసుబ్రహ్మణ్యం, వి.వి.కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, వి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

## పోలీసు లీగల్ అడ్వైజర్‌గా రామ్మోహన్‌రావు

నెల్లూరుజిల్లా పోలీసు లీగల్ అడ్వైజర్‌గా సీనియర్ న్యాయవాది వి.రామ్మోహన్‌రావు నియమితులయ్యారు. న్యాయపరమైన ఇబ్బందులు, నోటీసులు, పోలీసు అధికారులు, సిబ్బందికి అవసరమైన న్యాయ సలహాలు, సూచనలతో పాటు పలుకేసులను ఆయన చేపట్టనున్నారు.

## మనీస్కీం బాధితులను ఆదుకోవాలి

మనీస్కీం బాధితులను ఈ నెల 30వ తేదీలోగా ఆదుకోవాలని, లేదంటే తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుతో సంప్రదించి కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రత్యక్ష ఆందోళన చేపడతామని టీడీపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర సోమవారం పేర్కొన్నారు. మనీస్కీం నిర్వాహకులు మాయమాటలు చెప్పి బాధితుల నుంచి దాదాపు 285 కోట్లు వసూలు చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మనీస్కీం మోసాలపై చంద్రబాబు, ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. పేదల నుంచి పెద్దమొత్తంలో నగదు వసూలుచేసినా నిర్వాహకులను ఇంతవరకు అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి నిర్వాహకుల నుంచి సొమ్ము రికవరీ చేసి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు.

## విధుల్లోకి వీరభద్రయ్య

జిల్లా పరిషత్ సిఇఓగా వీరభద్రయ్య ఈ నెల 28 నుండి తిరిగి విధుల్లోకి చేరనున్నారు. అనారోగ్యం కారణంగా ఆయన దీర్ఘకాలంగా సెలవులోవున్నారు. ఇంతవరకు డిఆర్‌ఓ బి.రామిరెడ్డి ఇన్‌ఛార్జ్ సిఇఓగా వ్యవహరిస్తూవచ్చారు.

## సన్నబియ్యం పట్టివేత

నెల్లూరు నగరంలోని తడికెలబజారు విజయగోపాలపురంలోని రైసుమిల్లుపై సోమవారం పౌరసరఫరాల అధికారులు దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వచేసిన రూ.9.50లక్షల విలువైన సన్నబియ్యం, 160క్వింటాళ్ళ ధాన్యం, 25 క్వింటాళ్ళ నూకలను సీజ్ చేశారు. నిర్వాహకులపై 6ఏ కేసులను నమోదు చేశారు. ఈ దాడిలో ఏఎస్‌ఓలు శంకరన్, శ్రీహరి, సిఎస్‌డిటీలు రవీంద్రబాబు, శివకుమార్‌లు పాల్గొన్నారు.

# డిఇఓ ఆఫీసులో ఏజేసీ

జిల్లా అదనపు జాయింట్ కలెక్టర్ సి.హెచ్.పెంచలరెడ్డి 18వ తేదీ జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. విద్యాశాఖలో అమలు జరుగుతున్న పథకాలు, ఈ నూతన విద్యాసంవత్సరంలో చేపడుతున్న చర్యలపై డిఇఓతో రాజీవ్‌విద్యామిషన్ ప్రాజెక్ట్ అధికారితో సుదీర్ఘంగా చర్చించారు.

# కామన్‌సిలబస్ అమలుకు డిమాండ్



వెంకయ్యనాయుడుని కలిసిన ఏబివిపి నాయకులు

ఎల్‌కెజీ నుంచి పోస్టుగ్రాడ్యుయేషన్ వరకు దేశవ్యాప్తంగా కామన్ సిలబస్ అమలు చేయాలని ఏబివిపి నాయకులు సోమవారం డిమాండ్ చేశారు. ఈమేరకు బీజేపీ జాతీయనాయకుడు ముప్పవరపు వెంకయ్యనాయుడును నెల్లూరులోని ఆయన నివాసంలో కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మౌళి మాట్లాడుతూ దేశమంతా ఒకే విద్యావిధానం ఉంటే విద్యార్థులకు ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. రాష్ట్రంలో 17విశ్వవిద్యాలయాలు ఉంటే, ఒక్కో యూనివర్శిటీలో ఒక్కో సిలబస్ అమలులో ఉందన్నారు. భవిష్యత్తులో ఇది విద్యార్థులకు నష్టం కలిగిస్తుందన్నారు. జనలోక్‌పాల్ బిల్లులో విద్యాసంస్థలను చేర్చడం ద్వారా విద్యాప్రగతికి దోహదపడాలన్నారు. దేశవ్యాప్తంగా ఒకే ఫీజుల విధానం అమలైతే విద్యావిధానం పటిష్టమవుతుందన్నారు. జిల్లాలోని కృష్ణపట్నం పోర్టు, రిలయన్స్, జెన్‌కో, అపాచి తదితర పరిశ్రమల్లో స్థానికులైన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏబివిపి నాయకులు ప్రణయ్, అశోక్, బెనర్జీ, కేశవ, రమేష్, శివ, హరీష్, మనోహర్, రూపేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# స్టేడియం వాకర్స్‌కు హెల్త్ ఆడిట్



నెల్లూరు దర్గామిట్ట లోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 16న వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నారాయణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సిబ్బంది వాకర్స్‌కు ఆరోగ్య పరీక్షలు జరిపారు.

సుమారు 90మంది వాకర్స్‌కు 8రకాల రక్తపరీక్షలు, ఇసిజి తదితర పరీక్షలు చేసి హెల్త్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు రాఘవేంద్రషెట్టి మాట్లాడుతూ గత 5ఏళ్ళ నుండి ప్రతి మూడునెలలకోకసారి సభ్యులకు హెల్త్ ఆడిట్ నిర్వహిస్తున్నామని, నడక ఆరోగ్యం ఇచ్చినప్పటికీ ఆరోగ్య జాగ్రత్తలు పాటించడానికి, అవయవాల పనితీరును ఏరీతిలో వున్నది తెలుసుకోవడానికి ఈ పరీక్షలు ఉపయోగపడతాయని అన్నారు. ఈనెల 20న నారాయణ హాస్పిటల్ డాక్టర్ భక్తవత్సలరెడ్డి, అసోసియేషన్ సభ్యులు డాక్టర్ అంకిరెడ్డి వైద్యపరీక్షల ఫలితాలు చూసి సలహాలు ఇచ్చి మందులు సూచిస్తారని పేర్కొన్నారు. వైద్యసిబ్బందికి సభ్యులకు మురళీకృష్ణ హోటల్ యండి.హజరత్‌బాబు అల్పాహార విందు ఇచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి నలుబోలు బలరామయ్యనాయుడు, కోశాధికారి స్వర్ణరమేష్, ఉపాధ్యక్షులు దద్దోలు రమణయ్య, డాక్టర్ సిహెచ్ దొరస్వామి నాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ వి.రంగారావు, యం.ఎల్లారెడ్డి, టి.ఆర్.హరికృష్ణ, విజయమోహన్‌రెడ్డి, దశయ్య తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version



సింహపురి సమాచారం

○ తెలుగు వెలిగింది!

# న్యాయదేవత హర్షించింది



తెలుగులో తీర్పు చెప్పిన న్యాయమూర్తులు

*బ్రిటీష్‌కాలం నుండి ఆంగ్లంలోనే తీర్పులు... 130ఏళ్లుగా ఇదే సాంప్రదాయం. ముగ్గురు న్యాయమూర్తులు ఆ సాంప్రదాయాన్ని తిరగరాసారు. సవతితల్లి లాంటి ఆంగ్లభాషను పక్కనపెట్టి సొంత తల్లిలాంటి తెలుగుభాషలో తీర్పులిచ్చారు. న్యాయస్థానాల్లో కూడా మాతృభాషను అమలుచేయాలన్న సంకల్పంతో ఓ ముందడుగు వేసారు.*

కావలి పట్టణంలో సీనియర్ సివిల్‌జడ్జి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులున్నాయి. 130ఏళ్లుగా ఎవరు న్యాయమూర్తులుగా వచ్చినా ఇంగ్లీష్‌లోనే తీర్పులిస్తూ వచ్చారు. కాని ఈ నెల 17వ తేదీన ఈ కోర్టులలో న్యాయమూర్తులుగా పనిచేస్తున్న పి.గురప్ప, రాజావెంకటాద్రి, మహ్మద్‌నజీర్‌లు తెలుగులోనే తీర్పులిచ్చారు. సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులో అత్యాచారయత్నం కేసును న్యాయమూర్తి గురప్ప విచారించి తెలుగులో తీర్పు వెలువరించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన కేసులను విచారించి రాజా వెంకటాద్రి తెలుగులో తీర్పు చెప్పారు. అలాగే అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో విధుల్లో వున్న ఉద్యోగికి ఆటంకం కలిగించారనే కేసును విచారించి న్యాయమూర్తి మహ్మద్ నజీర్ తెలుగులో తీర్పునిచ్చారు. వీరు తెలుగులో తీర్పులు చెప్పడంతో కక్షిదారుల్లో ఆనందం వ్యక్తమైంది. ప్రతిచోటా ఇదే విధంగా తెలుగును అమలుచేస్తే మాతృభాషను ప్రేమించడంలో మనం తమిళులను మించిపోమా!

# రిజర్వేషన్లలో బీసీలకు తీరని అన్యాయం

## తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర



గ్రామపంచాయితి రిజర్వేషన్లలో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. నెల్లూరుజిల్లాలో మొత్తం 940పంచాయితీలుండగా బీసీలకు 34శాతం రిజర్వేషన్ ప్రకారం 320సీట్లు కేటాయించవలసివుండగా కేవలం 205సీట్లు మాత్రమే కేటాయించారని ఆరోపించారు. జిల్లాలో 5,51,279మంది బీసీ ఓటర్లు ఉండగా వారికి కేవలం 205మాత్రమే కేటాయిస్తే 3,48,287మంది ఓటర్లు ఉన్న వర్గానికి 423సీట్లు కేటాయించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇప్పుడు పంచాయితీ ఎన్నికల్లో రిజర్వేషన్లు తగ్గించడం ద్వారా గ్రామస్థాయి నుండీ బీసీలు రాజకీయంగా ఎదగకుండా ఉండేందుకు కాంగ్రెస్‌పార్టీ కుట్ర చేస్తోందన్నారు. నెల్లూరుజిల్లాలో తెలుగుదేశంపార్టీ పాలనలో 2001లో బీసీలకు 280పంచాయితీలు రిజర్వు కాగా నేడు కేవలం 205పంచాయితీలు మాత్రమే కేటాయించారన్నారు. దీంతో బీసీలకు జిల్లాలో 115సీట్లు తగ్గిపోయాయన్నారు. తక్షణమే రిజర్వేషన్ల కేటాయింపులో బీసీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకై జిల్లా యూనిట్‌గా బీసీలకు రిజర్వేషన్లు కేటాయించాలని తీవ్రంగా హెచ్చరించారు.

# పేద ఆర్యవైశ్యుల అభివృద్ధికి పాటుపడతా!

## - ముక్కాల ద్వారకానాథ్



ఆర్యవైశ్య ప్రముఖులను సత్కరిస్తున్న ముక్కాల ద్వారకానాథ్

నెల్లూరు స్టోన్‌హౌస్ పేట పప్పులవీధిలోని పాండురంగ అన్నదాన సమాజంలో ఈనెల 16న ఇటీవల ఆర్యవైశ్య మహాసభలో పదవులు స్వీకరించిన పలువురిని ఆర్యవైశ్య సంఘం గౌరవంగా సత్కరించింది. ఈ సందర్భంగా అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయం పాలక మండలి మాజీసభ్యులు నూతన కమిటీ విషయంలో రాజకీయాలు చేస్తూ ఆలయ పరువును కోర్టు కీడ్చారని, దేవస్థానాలలో రాజకీయాలు తగదని అన్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడికి కాంగ్రెస్‌పార్టీలో సభ్యత్వం వుంటేనే సహకారం అందిస్తారా? అని ప్రశ్నించారు. దివంగతనేత వైయస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో ఇచ్చిన ఉత్తర్వులు ప్రకారమే నూతన కమిటీ నియామకం జరిగితే దానిని అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. జూలై 4న తమిళనాడు గవర్నర్ రోశయ్య జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పేదవారికి ఉపాధి పథకం ద్వారా సాయంచేస్తామని పార్టీలకు అతీతంగా ఆర్యవైశ్యుల అభివృద్ధికి పాటుపడతామన్నారు. కార్యక్రమంలో రొటేరియన్ చలమయ్య, తిరువీధి ప్రకాశరావు, చీదెళ్ళ వెంకటేశ్వర్లు, తిరుమలరావు, ముప్పసాని శ్రీనివాసులు, శ్రీరాం రమేష్, బయ్యా ప్రసాద్, ఆనందకృష్ణ, దోరడ్ల సత్యనారాయణ, కొండా ప్రదీప్, సరాబు సుబ్రహ్మణ్యం, పబ్బిశెట్టి శ్రీనివాసులు, కొల్లా నాగరాజు, వేణుగోపాల్, హజరత్తయ్య పాల్గొన్నారు.

# కావలి ఆర్టీసీ డిఎం బదిలీ

నెల్లూరుజిల్లా కావలి ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ కృష్ణాజిల్లా జగ్గయ్యపేటకు బదిలీ అయినట్లు సమాచారం. కావలి ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బాపట్లలో పనిచేస్తున్న రామసుబ్బారావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ అధికారికంగా బదిలీ ఉత్తర్వులు రాలేదన్నారు. తనను జగ్గయ్యపేటకు బదిలీ చేసినట్లు ఉన్నతాధికారుల నుంచి సమాచారమందిందన్నారు.



ఈ నెల 18వ తేదీన హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం క్యాంపస్ నిర్మాణంపై జరిగిన సమీక్షాసమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి. పక్కన ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సాంబశివరావు, యూనివర్శిటీ ఉపకులపతి ఆచార్య రాజారామిరెడ్డి, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి.

# స్కూలు బస్సులతో జరజాగ్రత్త!



పాఠశాలల వాహనాల మెరుగులు చూసి ఎప్పటికీ మోసపోకూడదు. వాహనాల కండీషన్ ఎలావుందో కూడా ముఖ్యం. దానిని పరిశీలించాల్సిన అవసరం తల్లిదండ్రులపై వుంది. విద్యార్థులను ఇంటి నుంచి పాఠశాలలకు, పాఠశాలల నుంచి ఇంటికి తీసుకువెళ్లే వాహనాలు నిబంధనలను గాలికివదిలేస్తున్నాయి. నెల్లూరు నగరంలో పలు పాఠశాలలకు బస్సులు, వ్యాన్‌లు ఉన్నాయి. అవి బయలుదేరినప్పటి నుంచి తిరిగి వారు క్షేమంగా ఇల్లు చేరేంతవరకూ తల్లిదండ్రుల్లో టెన్షన్. తమ పిల్లవాడు క్లాసులో ఎలా చదువుతున్నాడో, సరైన వేళకు భోజనం చేస్తున్నాడా? లేదా? అనేదానికంటే కూడా బస్సు, వ్యాన్ నడిపే డ్రైవరు రోడ్డుమీద ఎలా ప్రయాణిస్తున్నాడో, ముందు వెనుకా చూస్తున్నాడా లేదా అనే ప్రశ్నలు నిత్యం తల్లిదండ్రుల్లో ఆవేదన మిగిలిస్తున్నాయి. ముఖ్యంగా విద్యార్థులను చేరవేసే బస్సులు, వ్యానులు నిర్వహణపై పాఠశాలల యాజమాన్యం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం వుంది. వాహనాల నిర్వహణలో అశ్రద్ధ చేస్తే జరిగే ప్రమాదాలకు బాధ్యులు కావాలసివుంటుంది.

# నీటితీరువా పన్నులు వసూలు చెయ్యండి

## జేసీ లక్ష్మీకాంతం



సెట్‌కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న లక్ష్మీకాంతం

నెల్లూరుజిల్లాలో పేరుకుపోయిన నీటి తీరువా బకాయిల వసూళ్ళకు తహాశీల్దార్లు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని జేసీ ఛాంబర్‌లో సోమవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి, తహాశీల్దార్లతో సెట్‌కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఏడో విడత భూపంపిణీకి సంబంధించి గుర్తించిన భూముల్లో సర్వేలు పూర్తిచేయాలన్నారు. కౌలురైతులకు రుణ అర్హత కార్డుల మంజూరుకు నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలపై ఉత్తరం ద్వారా అర్జీదారులకు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ ఉమా మహేశ్వరరావు, పౌరసరఫరాల విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ మల్లిఖార్జున, భూపరిపాలన తహాశీల్దారు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.







# కదంబం

## పసికూనకు బోసినవ్వే కరువైపోయింది

మంచికంటి, 9949535695
santivanam.blogspot.com

కన్నులు మూసే పిల్లల కన్నీళ్ళ వెనుక
ఏ బాధల గాధలున్నాయో కాస్త కళ్ళు విప్పి చూద్దామా
అనువులు బాసి అందాల బొమ్మల ఆత్మలతోనైనా
మాట్లాడేద్దామా
అనగనగా కథలు విన్న సాంస్కృతిక రాజ్యంలో
పసికూనకు బోసినవ్వే కరువైపోయింది
పుట్టిన పాపకు నడకలు నేర్పకపోయినా పరవాలేదు
వుగ్గుపాలతో పరభాషను నూరిపోసేంత
నరకంలోకి జారిపోయామిప్పుడు
పిల్లల భవిష్యత్తు కలల పెరట్లోకి ఎన్నెన్నో నరకాలు
అడుగులు వేసుకుంటూ వచ్చేశాయి
సంస్కృతి తెలియదు భాష లేదు
నోటమాటెలా వస్తుంది
మనసుపొరల్లో ప్రేమలెలా విచ్చుకుంటాయి
పరాయి భాషా నూరిపోతలో
బ్రతికి వున్నదీ తెలియదు
ప్రాణం పోయేదీ తెలియదు
చల్లని గాలుల ఆస్వాదనలేమిటి
పచ్చటి సాయంత్రాల కేరింతలెక్కడ
మనిషిమనిషినీ కలిపి కుట్టే
ఆత్మీయానుబంధాలకు తావెక్కడ
సుడులు తిరిగే దుఃఖపు హోరులో
ఎవరు ఎవరికి ఏమౌతారో
బతుకు పోరులో ఎవరికి ఎందుకు ఖైదీలయ్యారో
తెలియని యుద్ధంలో రాటుదేలిన యంత్రాలు వీళ్ళు

## నాన్న ఒక ఏటీయం



తమ కవితల్ని చదివి వినిపిస్తున్న కవులు

నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి జూనియర్ కళాశాల ఆవరణలో ఈ నెల 16న పెన్నారచయితల సంఘం ఆధ్వర్యంలో "నాన్న" అంశంపై కవిసమ్మేళనం జరిగింది. పలువురు కవులు తమ కవితలలో నాన్న ఒక ఏటీయం కార్డ్‌గా పరిగణిం చబడుతున్నాడని, వృద్ధాప్యంలో చక్రాల కుర్చీలో ఏకాకిగా మిగిలి పోతున్నాడని విచారాన్ని వ్యక్తం చేయగా, కొందరు నాన్న ఒక ఆరాధ్యదైవం అని, నాన్ననే ఆదర్శంగా అనుసరిస్తూ జీవితం గడపా లని ఆశిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పెన్నా రచయితల సంఘం అధ్యక్షులు షంషుద్దీన్, కార్యదర్శి గోవిందరాజుల సుభద్రాదేవి, వ్యవస్థాపక అధ్యక్షులు మోపూరు పెంచలనర సింహం, గుండాల నరేంద్రబాబు, ఎ.శ్రీధర్‌బాబు, ఇంద్రగంటి మధుసూదన్‌రావు, కారుమంచి నాగేంద్ర, కవిత, తనూజ, స్నేహ, గాలి లలిత, పల్లాపు రాము, ఊరిబిండి సుబ్రహ్మణ్యం, తల్లావజుల సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు.

## పెన్నా సాహిత్య పురస్కారం-2013

రాష్ట్రస్థాయిలో పెన్నా రచయితల సంఘం (పెరసం) ప్రతి ఏటా ప్రదానంచేసే పెన్నా సాహిత్య పురస్కారానికి జనవరి, 2012 నుండి జూన్ 2013 వరకు ప్రచురించబడిన కవితా సంపుటాలను ఆహ్వానిస్తోంది. ఉత్తమ రచనకు 5000/-నగదుతో పాటు సత్కారం వుంటుందని, అందుకు 4ప్రతులను పంపాలని పెరసం కోరుతోంది. దీంతో పాటు రాష్ట్రస్థాయి కవితల పోటీకి ఏదైనా సామాజిక అంశంపై 30వాక్యాలకు మించని కవితలను పంపమని కోరుతోంది. జూలై 15లోగా కవితా సంపుటాలను కవితలను షేక్ షంషుద్దీన్, సూర్య స్కూల్, జడ్పీకాలనీ పొదలకూరురోడ్డు నెల్లూరు-4 సెల్.94415 98547చిరునామాకు పంపవలెను.

# నెల్లూరుదోమల దాడికి నిరసనగా తెలంగాణ బంద్

శ్రీను గల్పిక

అది బాంబుపేలుళ్ల రహిత నగరంగా ఐఎస్ఐ గుర్తింపు పొందిన భాగ్యనగరం. సచివా లయంలో ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఛాంబర్. సీఎంతో పాటు మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, రఘువీరారెడ్డి, గీతారెడ్డి, దానం నాగేందర్, పొన్నాల లక్ష్మయ్య, వట్టి వసంతకుమార్, డిజిపి దినేష్‌రెడ్డి.. ఇంకా మరికొంతమంది అధికారులు వున్నారు. సీఎం కిరణ్ ఫ్యూన్‌ను పిలిచి... అందరిని లెక్కపెట్టి, వన్‌బైటు లెక్కన అందరికీ టీ చెప్పు అని ఆదేశించాడు. తర్వాత ఆయన వుండి... రేపు అసెంబ్లీ ముట్టడికి తెలంగాణ జేఏసీ పిలుపునిచ్చింది. వాళ్ళు అసెంబ్లీని ముట్ట డిస్తే మన ప్రభుత్వం పరువు హుస్సేన్‌సాగర్‌లో కలవడం ఖాయమన్నాడు. ఆ మాటకు వట్టి వసంతకుమార్... ఇప్పుడేదో పరువున్నట్లు అని వెటకారంగా అన్నాడు. అందుకు కిరణ్... వున్న పరువునే కాపాడుకుందాం... సబితక్కా, ఎలా చేద్దామంటారు అని తేరిపారా చూసాడు. తర్వాత కేబినెట్‌లో ఆమె లేదనే విషయం గుర్తొచ్చి... ఏంటో నా మంత్రులందరూ కేసుల్లో ఇరుక్కుంటున్నారు. ఇంకా ఎంతమంది ఇరు క్కుంటారో ఏమో అని నిట్టూర్చాడు. ఆ మాటకు మంత్రులందరికీ మండింది. అయినా ఇతనికి కోపం వస్తే ఈమధ్య బర్తరఫ్‌లు చేస్తున్నాడు, మనకెందుకొచ్చిన గొడవలే అని వూరకున్నారు. అసెంబ్లీలో హోంశాఖ బాధ్యతలు చూస్తున్న గీతారెడ్డి వుండి... రేపు అసెంబ్లీ ముట్టడి సందర్భంగా ఏమేం బందోబస్తు ఏర్పాట్లు చేసారో మన డిజిపి దినేష్‌రెడ్డి గారు చెబుతారు వినండి అని చెప్పింది. అప్పుడు దినేష్‌రెడ్డి లేచి... తెలంగాణ జేఏసీ వాళ్లంతా అసెంబ్లీ నలుమైపుల నుండి దూసుకొచ్చే అవకాశాలున్నాయి. కాబట్టి నేను అన్ని జిల్లాల నుండి వేలసంఖ్యలో పోలీ సులను రప్పించాను. ఖైరతాబాద్ వద్ద 2వేల మంది పోలీసులు, 500 సుమోలుంటాయి. తెలంగాణవాదులను అక్కడ దాటకుండా అడ్డుకుంటాం... పొరపాటున అక్కడ దాటారే అనుకో... ఈసారి హుస్సేన్‌సాగర్ దగ్గర 5వేల మంది పోలీసులు, వెయ్యి సుమోలు వుంటాయి, ఖచ్చితంగా అక్కడ ఆందోళనకారులను అడ్డు కుంటాం... అక్కడ కూడా మిస్సయ్యారను కుందాం... ఈసారి అసెంబ్లీకి దగ్గరలో 10వేల మంది పోలీసులు, రెండువేల సుమోలు వుంటాయి. అక్కడ గ్యారంటీగా పట్టేస్తాం అని చెప్పసాగాడు. అదంతా వింటున్న కిరణ్‌కు... మహేష్‌బాబు హీరోగా నటించిన 'అతను' సినిమా డైలాగ్‌లు గుర్తుకొచ్చాయి. వెంటనే అన్ని సుమోలు, అంతమంది పోలీసులు ఎందుకు దినేష్‌రెడ్డి... అసలే డీజిల్ రేట్లు పెరిగాయి, సుమోల అద్దెలు కూడా ఎక్కువే! బయట జిల్లాల నుండి పోలీసులను తీసుకొస్తే అదనపు ఖర్చు. ఇక్కడ టీకే టికానా లేక వన్‌బైటు చెప్పుకుని తాగుతున్నాం. రూపాయి ఖర్చు లేకుండా ఫ్లో అసెంబ్లీని ఫెయిల్ చేసే మార్గమేదన్నా వుంటే చూడు అని అన్నాడు. దానికి దినేష్‌రెడ్డి... అలాంటప్పుడు కేంద్ర బలగాలను దించి అసెంబ్లీ వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరినీ చావబాదితే సరి అని చెప్పాడు. అందుకు కిరణ్... మనకు హింసాత్మక పద్ధతులొద్దు... ఏదైనా శాంతి యుతంగా జరిగిపోవాలి. లాఠీ ఎత్తకూడదు... రక్తం చిందకూడదు... చొక్కాలు చిరక్కూడదు... ఆ విధంగా అసెంబ్లీ ముట్టడిని నీరుగార్చే ఉపాయముంటే చెప్పండని అడిగాడు. పోలీసులు లాఠీలకు పనిచెప్పకుండా ఎలా అడ్డుకోగలరని గీతారెడ్డి నిలదీసింది. లాఠీలకు పనిపెడితే ఉద్యమం తీవ్రరూపం దాలుస్తుందని, మన కొరివితో మనమే తల గోక్కున్నట్లవుతుందని పొన్నాల లక్ష్మయ్య అభ్యంతరం పెట్టాడు. వీరి మధ్య వాదోపవాదాలు జరుగుతుండగా...

"ఈ తొక్కలో మీటింగ్ లేంటో నాకు అర్థం కావడం లేదు" అనే మాట వినిపించింది. దాంతో అందరూ వెనక్కి తిరిగి చూసారు. అక్కడ స్టైల్ ఆఫ్ సింహపురి, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి (63+) వున్నారు. ఏయ్... మెంటల్ ఏంటి నువ్వు మాట్లాడేది అని పొన్నాల లక్ష్మయ్య అన్నాడు. నేను కరెక్ట్‌గానే మాట్లాడు తున్నాను. అసెంబ్లీ ముట్టడికి 50వేల మంది వస్తారా... లక్షమంది వస్తారా... మహా అంటే రెండు లక్షలమంది వస్తారా.... నో ప్రాబ్లం, వారి సంగతి నేను చూసుకుంటాను. లాఠీ అవసరం లేదు.. రక్తం బయటకు రాదు... కాని వారి హాహాకారాలను మాత్రం ఎవ్వరూ ఆపలేరు. ప్రాణభీతితో వాళ్ళు పెట్టేకేకలు చూస్తే మీకు కూడా జాలి కలుగుతుంది. ఈ వివేకా ఏంటో మీరు రేపు చూస్తారు అని చెప్పాడు. వివేకా ధైర్యానికి, నమ్మకానికి కిరణ్ తెగ ముచ్చట పడ్డాడు. సరే, ఈ అసెంబ్లీ ముట్టడి ఆపరేషన్ బాధ్యతలు నీకే అప్పగిస్తున్నానని చెప్పి లేచాడు.

★★★★★

పక్కరోజు టీ-జేఏసీ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం. పెట్టుకుంది. టీఆర్ఎస్ నేతలు కేసీఆర్, హరీష్‌రావు, ఈటెల రాజేందర్, కవిత, కేటీఆర్, ఇంకా నాయకులు, ఆందోళనకారులు ఓ పక్క నుండి... బీజేపీ నేతలు బండారు దత్తా త్రేయ, సి. హెచ్. విద్యాసాగర్‌రావు, కిషన్‌రెడ్డి, నాగం జనార్ధన్‌రెడ్డి ఇంకోవైపు నుండి, కోదండరాం, ఉస్మానియా విద్యార్థులు మరోవైపు నుండి... అందరూ అసెంబ్లీ వైపు వస్తున్నారు. అసెంబ్లీ ముందు వేలాదిమంది పోలీసులు భాష్పవాయువులతో సిద్ధంగా వుంటారని, తమను అడ్డుకుంటారని ఆందోళనకారులు వూహించు కుంటూ వచ్చారు. తీరా అక్కడికొచ్చి చూస్తే సీన్ రివర్స్... ఒక్క పురుగు కూడా లేదు. అంతేకాదు. ప్రతిరోజూ అసెంబ్లీ వద్ద వుండే సెక్యూరిటీ గార్డ్‌లు కూడా లేరు. కాని దూరంగా ఆనం వివేకానందరెడ్డి, నెల్లూరు నగరపాలక సంస్థ కమీషనర్ శ్యాంసన్, మరికొందరు మున్సిపల్ సిబ్బంది మాత్రం వున్నారు. ఆందోళనకారులకు అక్కడి వాతావరణం చూసి మొదట అనుమానం వేసింది. అక్కడ వివేకా కనిపించేసరికి తమకు తెలియకుండా ఏదో కుట్ర జరుగుతుందని భయ మేయసాగింది. అయినా ఇక్కడిదాకా వచ్చి వెనక్కి పోతే బాగుండదని ముందుకు కదిలారు. అంతే... అక్కడేవున్న వివేకా, కమీషనర్ శ్యాంసన్, సిబ్బంది తమ వద్దవున్న కొన్ని బ్యాగుల మూతలను విప్పారు. వాటిలో బందీలుగా వున్న నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలు తెలంగాణ ఆందోళనకారులపై ఒక్కసారిగా విరుచుకుపడ్డాయి. దొరికినవారిని దొరికినట్లు కరిచి, రక్తాన్ని పీల్చసాగాయి. ఈ పరిణామాన్ని వూహించని ఆందోళనకారులు ప్రాణభయంతో పరుగులు తీయసాగారు. కొందరు పక్కనే వున్న భవనాలు, షాపులలో దూరి తలుపులు వేసుకున్నారు. నిముషం వ్యవధిలో ఆ పరిస రాలలో ఒక్కరంటే ఒక్కరూ లేకుండా పోయారు. టీవీలలో ప్రత్యక్షప్రసారం ద్వారా ఈ దృశ్యాలను చూస్తున్న కిరణ్, ఇతర మంత్రివర్గసభ్యులు వివేకా అంటే వివేకానే... అతని ప్లేస్‌ను ఎవరూ భర్తీ చేయలేరని మెచ్చుకున్నారు.

★★★★★

నెల్లూరు ముదురుదోమల దాడితో దాదాపు వెయ్యిమంది ఆందోళనకారులు తీవ్రంగా గాయపడ్డారు. వారందరిని నిమ్స్, కేర్, అపోలో ఆసుపత్రులలో చేర్చారు. ఈ సంఘటనపై తెలం గాణ జేఏసీ తీవ్రంగా స్పందించి పక్కరోజు తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చింది. అంతేకాదు నెల్లూరు కార్పొరేషన్ ముదురుదోమల దాడిపై ప్రపంచ మానవహక్కుల సంఘానికి కూడా ఫిర్యాదు చేయనున్నట్లు టీ-జేఏసీ వెల్లడించింది.

★★★★★

# పూర్తిస్థాయిలో వైద్య సేవలందించండి

ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవా కార్యక్రమాలు పూర్తిస్థాయిలో పేద ప్రజలకు అందించడంలో ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ వైద్యాధికారులను ఆదేశించారు. నెల్లూరులోని కలెక్టర్ ఛాంబర్‌లో ఈనెల 18న జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ వైద్యాధికారులతో పేదలకు అందిస్తున్న వైద్య కార్యక్రమాలపై సమీక్షించి పలు సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానంగా మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, తదితర వ్యాధులు సోకకుండా నివారించేందుకు ప్రజలకు పూర్తి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ ప్రక్రియలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో సమీక్షించి వ్యాధుల నివారణ కొరకు తీసుకోవలసిన జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. తరచుగా ఆరోగ్య, వైద్యసేవా కార్యక్రమాల నిర్వహణను పటిష్టంగా చేపట్టేందుకు టాస్క్‌ఫోర్స్ అధికారులను నియమించి సమర్థ వంతంగా జరిగేలా చూడాలన్నారు. అలాగే పారిశుద్ధ్య కార్యక్రమాలపై పూర్తి అవగాహన కల్పించి దోమల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్త చర్యలపై తెలియజేయాలన్నారు. ప్రధానంగా ప్రభుత్వ ఆసుపత్రులలో కాన్పులు చేసేలా చూడాలన్నారు. అలాగే ఆసుపత్రులలో కాన్పులు అయిన తరువాత డిశ్చార్జి చేసిన తదుపరి 108 వాహనంలోనే వారి ఇంటికి తరలిం చేలా చూడాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సంక్షేమ కార్యక్రమాలు



సమీక్షాసమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్


అర్హులైన వారికి సమర్థవంతంగా అమలుచేసేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు.

ఈ సమావేశంలో అదనపు జాయింట్ కలెక్టర్ సి. హెచ్. పెంచలరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి బి.రామిరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా॥ సుధాకర్‌రావు, జిల్లా మలేరియా అధికారి డా॥వేణుగోపాల్, జిల్లా వైద్య కో ఆర్డినేటర్ డా॥నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version



## మేషం



అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

భాగస్వామిక ఒప్పందాలు, కాంట్రాక్టులు, లీజులకు అనుకూల సమయము. ఆర్థిక లావాదేవీలు, కుటుంబ వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. విద్యా పరమైన ఫీజులు, ఇతర బిల్లులు, పన్నులు చెల్లింపు జరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరుగుతుంది. దూరప్రయాణాలుంటాయి. కొత్త ఉద్యోగ ప్రయత్నాలకు అనుకూల సమయము.

## వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

వ్యాపార విస్తరణ, క్రొత్త వ్యాపారసంస్థల ప్రారంభమునకు ప్రయత్నాలు జరుపుతారు. ఆర్థిక వ్యవహారాలను, బయటి ఇతర వ్యవహారాలను జాగ్రత్తగా నడుపుతారు. మీ ప్రయత్నాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. యజమానులకు వర్కర్లతో సమస్యలు రావచ్చును. ఉద్యోగులు అధికారులతోను, పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి.

## మిధునం



మృగశిర్ష 3, 4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

అదనపు ఖర్చులు అధికంగా ఉంటాయి. మీ ప్రయత్నాలు ఫలించి మంచి అర్థికావకాశాలు దొరకడం, ఆదాయం పెరగడం ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు రుణాలు అందుతాయి. గృహనిర్మాణాలు రిపేర్లు కొనసాగుతాయి. అనుకున్న పనులను నెరవేర్చుకొంటారు. శుభకార్యాలు నిర్ణయింకావడం, కోర్టు వ్యవహారాలు, కేసులు పరిష్కార దిశగా సాగడం జరుగుతుంది.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

పరిస్థితులు అవకాశాలనుబట్టి నిర్ణయాలు తీసుకొంటారు. వారంలో కొంత అదనపు ఖర్చులుంటాయి. వైద్య న్యాయ కాంట్రాక్ట్ బిల్డర్ రంగాలలో అవకాశాలు దొరుకుతాయి. వ్యాపారవర్గాలకు అభివృద్ధి మందకొడిగా సాగుతుంది. ఆదాయం సామాన్యంగా ఉంటుంది. అనుకున్నది నెరవేరే వరకు శ్రమపడుతుంటారు. పేర్లు లాభాలనందిస్తాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

అనుకున్న పనులు సానుకూలం కావడానికి బాగా శ్రమపడవలసి వస్తుంది. ఆర్థికంగా వృత్తి వ్యాపార వర్గాలకు బాగుండి ఆదాయం పెరుగుతుంది. కొత్త పెట్టుబడుల విషయంలో తొందరపడవద్దు. కుటుంబ సభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. విద్యా వైద్యపరమగు ఖర్చులు పెరుగుతాయి. ఉద్యోగప్రయత్నాలలో అను కూలత కలదు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్ర 1, 2 పాదాలు

బంధుమిత్రులతో సత్సంబంధాలు నెరపడి, వారి సహాయ సలహాలు పొందుతారు. వృత్తి వ్యాపారవర్గాలకు ఎక్కువ అవకాశాలు, ఆదాయం పెరగడం ఉంటుంది. ఉద్యోగ బాధ్యతలలో మార్పులు ప్రమోషన్లు ఉండగలవు. ఆదాయం బాగుండినా విద్యాఖర్చులు దూరప్రయాణ ఖర్చులుండి తీరుతాయి. ప్రభుత్వ అనుమతులు లభించగలవు. క్రొత్త కాంట్రాక్టులు లభించగలవు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 21.06.2013 నుండి
తేది. 27.06.2013 వరకు

ఈవారం మేషంలో కేతువు, మిథునంలో రవి కుజబుధ గురువులు, కర్కాటకంలో శుక్రుడు, తులలో శనిరాహువులు, వృశ్చికధనుర్మకర కుంభరాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము :

గురుమౌఢ్యమి జరుగుచున్నది.

**జ్యేష్ఠమాస శుక్లపక్షతిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 21 | శుక్ర | త్రయోదశి | రా॥గం.10.16ని॥ |
| తేది. 22 | శని | చతుర్దశి | రా॥గం.7.54ని॥ |
| తేది. 23 | ఆది | పూర్ణిమ | సా॥ గం.5.28ని॥ |

**జ్యేష్ఠమాస కృష్ణపక్షతిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 24 | సోమ | పాడ్యమి | సా॥ గం.3.00ని॥ |
| తేది. 25 | మంగళ | విదియ | ప॥ గం. 12.45ని॥ |
| తేది. 26 | బుధ | తదియ | ఉ॥గం.10.15ని॥ |
| తేది. 27 | గురు | చతుర్థి | ఉ॥గం. 8.10ని॥ |


## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

చేపట్టిన పనులందు ఏదో ఒకరూపంలో మెలికపడి ఆందోళనగా ఉంటుంది. ఆర్థికపరంగా తీసుకొనే నిర్ణయాలలో ఇతరుల సలహాలు పొందండి. వృత్తి వ్యాపారపరంగా అభివృద్ధి ఉంటుంది. ఆదాయం బాగుంటుంది. అయినా వైద్య విద్యా సంబంధమగు ఖర్చులెక్కువుగా ఉంటాయి. రావలసిన బాకీలు కొంత అందుతాయి. కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది.


## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆడంబరాలకు పలుకుబడి పెంచుకొనడానికి ఎక్కువ ఖర్చులుంటాయి. అగ్రిమెంట్లు, స్థిరాస్తుల లావాదేవీలు వాయిదావేసి కొనడం మంచిది. ప్రభుత్వ అనుమతులందు అలస్యంగాని, రద్దుకావడంగాని జరుగుతుంది. ఉద్యోగులు అధికారులతో సహచరులతో, పబ్లిక్‌తో జాగ్రత్తగా మెలగండి. స్థానమార్పులు కలుగవచ్చును. బంధుముఖ్యుల యొక్క అనారోగ్య వార్తలు వింటారు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకొనండి. వృత్తి వ్యాపార పరిశ్రమరంగాల వారికి మంచి అవకాశాలు లభించగలవు. ఆదాయం బాగుంటుంది. విద్యాఖర్చులు కుటుంబఖర్చులు పెరిగినా ఇబ్బందులు పడరు. ఏదో విధంగా సర్దుకొంటారు. అనుకున్న పనులు సక్రమంగా నెరవేరుస్తారు. బంధుమిత్రులు యొక్క సహాయం పొందడం జరుగుతుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలలో సామాన్య ఆదాయం ఉంటుంది. కష్టపడుతున్నా తగిన ప్రతిఫలం ఉండదు. అవగాహన లేని విషయాలలో జోక్యం చేసుకొనకండి. గత సంఘటనలు తలపుకు వచ్చి బంధువులతో విభేదాలు వివాదాలు చోటు చేసుకొంటాయి. స్థిరాస్తుల లావాదేవీలలో జాగ్రత్త పడండి. కోర్టు వ్యవహారాలు వాయిదాపడటం, రావలసిన బాకీలు రాకపోవడం ఉంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

చేయదలచిన పనులందు చక్కని అవగాహన పథకాలతో ముందుకుపోతారు. ఆర్థికస్థితి బాగుండి వ్యాపారవృత్తిరంగాలలో అభివృద్ధి ఆదాయం ఉంటుంది. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. వైద్య, విద్యాపరమైన ఖర్చులు పెరుగుతాయి. గృహ, వస్తు, వాహన రిపేర్లు జరుపవలసి ఉంటుంది. స్త్రీలకు ఏదో ఒక విధంగా ఖర్చులు వస్తుంటాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

అనుకున్న పనులకు ఆటంకాలు జరుగుతూ ఆందోళన కలిగిస్తాయి. కుటుంబసభ్యులతో అవగాహన కొరవడి ఇబ్బందులు పడతారు. పారిశ్రామిక వ్యాపార వృత్తి జీవనంలో ఆర్థికాభివృద్ధి అవకాశాలు లభించి ఆదాయం పెరుగుతుంది. ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకొనండి. విద్యా, వైద్యపరమైన అదనపు ఖర్చులుంటాయి. తొందరపడి హామీలు, అప్పులు ఇవ్వవద్దు.

# వెంగమాంబ హుండీ లెక్కింపు

నెల్లూరుజిల్లా నర్రవాడలో వేంచేసియున్న వెంగమాంబ పేరంటాలు దేవస్థానం హుండీని దేవాదాయశాఖ అసిస్టెంట్ కమీషనర్ వేగూరు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో 15వ తేదీ లెక్కించారు. ఈ ఏడాది జనవరి నెల 7వతేదీ నుంచి జూన్ 15వతేది వరకు హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా 11,16, 325లు ఆదాయం లభించినట్లు రవీంద్రరెడ్డి తెలిపారు. త్వరలో బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో హుండీ లెక్కింపును చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జొన్నవాడ ఇఓ సహాయకమీషనర్ కె. శివకుమార్, గూడూరు దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వి సుధాకర్, వ్యవస్థాపక ధర్మకర్త పచ్చవ తిరుపతినాయుడు, పచ్చవ వెంకటసుబ్బయ్య మాజీ సర్పంచ్ మాదాల లలితమ్మ పాల్గొన్నారు.

# ఆగష్టులో మహాశత చండీయాగం



నెల్లూరుజిల్లా కావలి రూరల్ మండలం రాజువారిచింతల పాళెంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ విజయదుర్గాపీఠం శ్రీవిజయదుర్గా దేవస్థానంలోని 18ఎకరాల సువిశాల ప్రాంగణంలో అగష్టునెల 15వతేదీ నుండి 23వతేదీ వరకు మహాశతచండీయాగమును అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు శ్రీ విజయదుర్గా ప్రస్థాన వ్యవస్థాపక పీఠాధిపతులు పత్రిబ్రహ్మయ్యస్వామి తెలిపారు. నెల్లూరు నగరం మూలాపేటలోని జంగమ సేవాసంఘం కల్యాణమండపంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగష్టు 15 నుంచి జరిగే మహాగణపతి, లక్ష్మి విజయదుర్గా గాయత్రి శత చండీయాగాన్ని లోకకల్యాణార్థం, ప్రపంచశాంతి కోసం జరుపుతున్నట్లు తెలిపారు. యాగంలో పాల్గొన్న భక్తులకు ఉద్యోగం, వ్యాపారం, వివాహం, సంతానం, ఆరోగ్యం, తదితర కోర్కెలు తీరుతాయన్నారు. ఈ యాగప్రదేశం వద్ద 500 హోమగుండాలను ఏర్పాటుచేస్తామని, ఒక్కో హోమగుండం వద్ద ఒక్కో పండితుడు ఉంటారని తెలిపారు. యాగంలో పాల్గొనే భక్తులు 99638 25572, 97016 94164, 94914 55144, 94408 80016, 90527 38444, 99636 53119, 94416 85916 సెల్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ మహాహోమంలో పాల్గొనే వారికి గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. గుర్తింపుకార్డులు లేని వారికి ప్రవేశం లేదన్నారు. ఈ సమావేశంలో జి.దశరథరామయ్య, యం.పిచ్చయ్య, పి.బుజ్జయ్య. పి.ప్రసాద్, చంద్రమౌళి, ఉమామహేశ్వరరావు, కల్పం రమేష్ పాల్గొన్నారు.

# విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



బుజబుజనెల్లూరులోని శ్రీనివాస స్కూలు విద్యార్థులకు ఈనెల 15న పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మురళీ మోహన్‌రాజు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేసారు. తన జన్మదిన సందర్భంగా ఆయన స్కూలు ప్రధానోపాధ్యాయులు యస్.వి.సుబ్బయ్య చేతుల మీదుగా విద్యార్థులకు చాక్లెట్లు, నోట్‌బుక్స్ అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు రవిగోగులపల్లి, సభ్యులు యస్.ప్రభాకర్‌రాజు, గోవింద్‌నాయక్, అశోక్, కిరణ్ పాల్గొన్నారు.




# పెళ్లి సంబంధాలు



## వధువు కావలెను

1. 1983 నవంబరు 8 జననం. ఎత్తు 5'10". చదువు బి.ఇ(మెకానికల్). వృత్తి వ్యాపారం. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్థివిలువ 20కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా.
2. 1985 జూలై 19 జననం. ఎత్తు 5'9". చదువు బి.టెక్(కావలి), యం.టెక్(చెన్నై). ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్(టి.సి.యస్), చెన్నై, జీతం 60,000/-. అస్థివాటా 2కోట్లు. ఉన్నతమైనరెడ్డి ఉద్యోగకుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా.
3. 1984 జనవరి 15 జననం. ఎత్తు 5'9". చదువు బి.ఇ(కంప్యూటర్స్). ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్. ఉద్యోగం యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రాన్స్‌పొరేటషన్(న్యూయార్క్). జీతం 8,000డాలర్లు. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగకుటుంబం. ఆస్థివాటా 75లక్షలు. స్వస్థలం నెల్లూరుజిల్లా.
4. 1986 సెప్టెంబరు 22 జననం. ఎత్తు 5'9". చదువు బి.ఇ, యం.బి.ఏ, పి.హెచ్.డి. ఉద్యోగం అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, కంపెని క్రాసిస్ ఇండియా, చెన్నై, ఆస్థివిలువ 10కోట్లు. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగకుటుంబం. స్వస్థలం మద్రాసు.
5. 1984 జూలై 29 జననం. ఎత్తు 5'8". చదువు యం.సి.ఏ. ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ జీతం నెలకు50,000/-. ఆస్థి విలువ 60లక్షలు. ఉన్నతమైనరెడ్డి రైతుకుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా.

## వరుడు కావలెను

6. 1988 ఫిబ్రవరి 25 జననం. ఎత్తు 5'7". చదువు బి.ఇ(కంప్యూటర్స్). యం.బి.ఏ. ఉద్యోగం సిస్టిక్స్ ఇంజనీర్, కంపెనీ "ఐ.బి.యమ్" ఇండియాప్రై లిమిటెడ్, బెంగుళూరు. జీతం 50,000/-. అస్థివాటా 10కోట్లు. ఉన్నతమైనరెడ్డి వ్యవసాయ కుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా.
7. 1988 మే 9 జననం. ఎత్తు 5'4". చదువు బి.ఇ(కంప్యూటర్స్). ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కంపెని ఐ.బి.యం. ఇండియాప్రైలిమిటెడ్. జీతం 60,000/-. ఆస్థివిలువ 2కోట్లు. ఉన్నతమైనరెడ్డి వ్యాపార కుటుంబం. స్వస్థలం చిత్తూరుజిల్లా. ప్రస్తుతం బెంగుళూరు.
8. 1988 జూలై 22 జననం. ఎత్తు 5'3". చదువు బి.ఇ(ఇన్ఫర్మేషన్ సైన్స్). ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కంపెని, బైనరి స్పెక్ట్రమ్ సాఫ్‌టెక్ ప్రై.లిమిటెడ్. బెంగుళూరు. జీతం 50,000/-. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్థి విలువ 11/2కోటి. స్వస్థలం చిత్తూరుజిల్లా. ప్రస్తుతనివాసం బెంగుళూరు.
9. 1988 జూలై 18 జననం. ఎత్తు 5'6". చదువు బి.ఇ(కంప్యూటర్స్). ఉద్యోగం కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్, మద్రాసు. ఆస్థివిలువ 11/2కోటి. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా. ప్రస్తుత నివాసం మద్రాసు.
10. 1988 మే 27 జననం. ఎత్తు 5'4". చదువు బి.టెక్(కంప్యూటర్స్). ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్థి విలువ 1కోటి. స్వస్థలం నెల్లూరుజిల్లా.

వివరాలకు: కొండూరు హరినారాయణరెడ్డి, 25-9-413, పోస్టల్‌కాలనీ, ఆంధ్రకేసరినగర్, నెల్లూరు - 4. | 98480 34522 94406 39460. | ఫోన్ట్‌బాక్స్ నెం.4, C/o. లాయర్ జాతీయ తెలుగు వారపత్రిక; ప్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు, మాగుంట లే-అవుట్, నెల్లూరు - 3.

# శ్రీసిటీలో 'చెన్నై బిజినెస్ స్కూల్'



రాష్ట్రంలోని అత్యంత పెద్ద ఆర్థికమండలిగా రూపొందుతున్న తడ సమీపంలోని 'శ్రీసిటీ' సెజ్‌లో ఇప్పటికే ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన పరిశ్రమలను నెలకొల్పడం తెలిసిందే! ఈ పరంపరలో భాగంగా బుధవారం అత్యంత ప్రాధాన్యతగల విద్యాసంస్థ 'చెన్నై స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎక్సెలెన్స్'కు ప్రారంభోత్సవం జరిగింది. అశోక్‌లేల్యాండ్ వైస్‌ఛైర్మన్ ఆర్.శేషసాయి, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవిసన్నారెడ్డి సమక్షంలో 'విట్' యూనివర్శిటీ వ్యవస్థాపకులు మరియు వైస్‌ఛాన్సలర్ డా॥ విశ్వనాథన్ జ్యోతిని వెలిగించి ఈ విద్యాలయాన్ని ప్రారంభించారు. 3ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ స్కూల్ జూలై నుండి పనిచేయడం ప్రారంభిస్తుంది. ఈ స్కూల్ ద్వారా అఖిలభారత సాంకేతిక విద్యా మండలి అనుమతి పొందిన పిజిడిఎం కోర్సును అందిస్తారు. మార్కెటింగ్, ఫైనాన్స్, హ్యూమన్‌రిసోర్స్, రీటైల్, టెలికాం, ఇంటర్నేషనల్ బిజినెస్, మానుఫ్యాక్చరింగ్ వంటి అంశాలపై బోధనాంశాలు ఉండడం ఇక్కడ ప్రత్యేకత. రెండేళ్ళపాటు కొనసాగే కోర్సుకు ఏడాదికి 3.25లక్షలు చెల్లించాల్సి వుంటుంది.

## గూడూరు ఆర్డీవోగా మధుసూదనరావు

నెల్లూరుజిల్లా గూడూరు ఆర్డీవోగా ఎన్.మధుసూదన్‌రావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సబ్‌కలెక్టర్ నివాస్‌ని అదిలాబాద్ జిల్లా ఉట్నూరు ఐటిడిఏకి బదిలీ చేశారు. దీంతో కడప కలెక్టరేట్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మధుసూదన్‌రావును గూడూరు ఆర్డీవోగా నియమించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మైత్రేయ, ఏవో వరకుమార్ రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాలధర్మం

## సిమ్స్ శ్రీధర్



ఆయన మృదుస్వభావి, స్నేహశీలి, అన్నింటికీమించి అసమాన ప్రతిభాశాలి, చిన్న పిల్లల వైద్యనిపుణుడిగా అతి చిన్న వయస్సులోనే అఖండ కీర్తిప్రతిష్టలు పొందిన యువ వైద్య మేధావి. శ్రీధర్ చిన్న పిల్లల ఆసుపత్రిని 1989లో ప్రారంభించి అనతికాలంలోనే దానిని శ్రీధర్ "ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్"గా అవతరింపజేసి నెల్లూరుజిల్లాలో పురిటి బిడ్డలకు అత్యాధునిక వైద్య సదుపాయాలను అందించగలిగే ఏకైక వైద్యాలయంగా తన సంస్థని తీర్చిదిద్దిన వ్యక్తి డాక్టర్ పి.శ్రీధర్.

చిన్న వయస్సులోనే పెద్దస్థాయికి వెళ్ళిన ఆయన ప్రస్థానాన్ని చూసి విధికి కన్నుకుట్టినట్లుంది. క్యాన్సర్ అనే మహమ్మారి రూపంలో పది సంవత్సరాల క్రితం నుండి మృత్యువు ఆయనకు దగ్గరయ్యింది. క్రమేణా తన విధులకు దూరమయ్యాడు, మిత్రులను కలుసుకోలేకపోయాడు. బాహ్యప్రపంచంలోకి రావడానికి ఇబ్బందిపడేవాడు. క్యాన్సర్‌కు తోడుగా గతకొద్ది నెలల నుండే లివర్ పాడైపోయింది. తోటి వైద్యుడిని బ్రతికించుకోవాలని ఆయన మిత్రులు ఇతర వైద్యులు ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. జూన్ 15వతేదీ శనివారం తెల్లవారుజామున తన 52వ యేట మద్రాసులోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచాడు. ఎందరో చిన్నారులకు ఆయన ప్రాణం పోశాడు, ఎందరో అమ్మానాన్నల ఆశలు చిగురింపజేశాడు, కాని ఆయన ప్రాణాలని ఎవ్వరూ కాపాడలేకపోయారు. శ్రీధర్ భార్య శ్రీమతి చంద్రలత ప్రముఖ సాహితీవేత్తగా సింహపురి సాహిత్యరంగానికి సుపరిచితురాలే. ఆయనకు ఓ కుమారుడు, కుమార్తె వున్నారు. వారి కుటుంబానికి 'లాయర్' ప్రగాఢ సానుభూతి.

## ప్రముఖ న్యాయవాది

## చింతా శ్రీరామమూర్తి

నెల్లూరులో పేరు ప్రతిష్టలున్న ప్రముఖ న్యాయవాది చింతా శ్రీరామమూర్తి(82) మంగళవారం మధ్యాహ్నం 4.30గంటలకు నెల్లూరు శ్రీనివాస అగ్రహారంలోని స్వగృహంలో కన్నుమూసారు. శ్రీరామమూర్తికి అయిదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు. ఈయన నెల్లూరు బార్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా, బ్రాహ్మణ సంఘం, ఆంధ్రమహాసభ, ట్రంకురోడ్డు, గాంధీనగర్ శ్రీ షిరిడి సాయిబాబా మందిరం, కంచి పీఠాధిశ్రీకారం, శ్రీ త్యాగరాజ భిక్షాటన తదితర పలు ధార్మికసంస్థల్లో వివిధ పదవులను అలంకరించారు. చింతా శ్రీరామమూర్తి మృతదేహాన్ని పలువురు న్యాయవాదులు రాజకీయ ప్రముఖులు, అభిమానులు, కుటుంబసభ్యులు సందర్శించి నివాళులు అర్పించారు.

## పవర్‌గ్రిడ్‌తో రైతులకు భారీనష్టం

### తెదేపా రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి



పవర్‌గ్రిడ్‌తో రైతులు భారీగా నష్టపోతున్నారని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విచారం వ్యక్తంచేశారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో రైతు సంఘం నేతలతో కలసి విలేకర్లతో మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో థర్మల్ పవర్‌స్టేషన్‌ను ఇష్టానుసారంగా అనుమతిచ్చారని, వీటికి సంబంధించి భారీ విద్యుత్తు స్తంభాలు నిర్మిస్తున్నారన్నారు. దీనిఫలితంగా పొలాలు పోగొట్టుకున్న రైతులకు నామ్‌కేవాస్తేగా ధర చెల్లిస్తున్నారని ధ్వజమెత్తారు. 2010-11 సంవత్సరంలో పవర్‌గ్రిడ్‌కు 3వేలకోట్ల ఆదాయం రాగా 2011-12లో 4,597కోట్ల మేర ఆదాయం వచ్చిందన్నారు. ఎంతో విలువైన స్థలాలను రైతులు పోగొట్టుకుంటుంటే నిర్మాణం పేరుతో స్వాధీనం చేసుకున్న స్థలానికి నామమాత్రంగా 96వేలు చెల్లించడం అన్యాయమన్నారు. జిల్లాలో మనుబోలు, చిల్లకూరు, ముత్తుకూరు ప్రాంతాల్లో రైతుల పరిస్థితి దయనీయంగా వుందన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు కోటిరెడ్డి, కృష్ణాజిల్లా రైతు సమాఖ్య నాయకుడు వేణుగోపాల్, తెదేపా ఎస్సీ సెల్ అధ్యక్షుడు రవీంద్ర, తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు రవికుమార్ చౌదరి, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## విక్రమ సింహపురికి మహర్దశ

### ఆధునిక వసతులతో నిర్మాణం

నెల్లూరులోని విక్రమ సింహపురి విద్యాలయానికి సంబంధించి క్యాంపస్ నిర్మాణానికి అవసరమైన నిధులతో పాటు ఇతర మౌలిక వసతుల కల్పనకు ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీచేసినట్లు, రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ నెల 18న హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో వెల్లడించారు. ప్రభుత్వ నిర్ణయంతో క్యాంపస్ నిర్మాణానికి అడ్డంకులు తొలిగాయని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య నాగేంద్రప్రసాద్ పేర్కొన్నారు. అత్యాధునిక వసతులతో నెల్లూరు సమీపంలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయాన్ని నిర్మించనున్నారు. దేశంలోని పలు ఐఐటీలతో పాటు ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాల భవనాలకు రూపకల్పన చేసిన చెన్నైకు చెందిన "స్టూప్" సంస్థ ప్రతినిధులు మంగళవారం ఆనం కార్యాలయంలో పలు డిజైన్లను ప్రదర్శించారు.

ఈ డిజైన్ల పరిశీలనలో రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో పాటు నెల్లూరు రూరల్, నగర ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాజారామి రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సాంబ శివరావులు పాల్గొన్నారు.

# హైవేలో 'రాఘవేంద్ర హైటెక్ సిటీ'



రియల్ ఎస్టేట్ రంగంలో అపారమైన అనుభవం వున్న తలచీరు రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో మరో అద్భుతమైన వెంచర్ వచ్చింది. పెట్టుబడిదారులకు ఇదో అరుదైన అవకాశం. నెల్లూరుజిల్లా దుగరాజపట్నం వద్ద కేంద్ర ప్రభుత్వం భారీ ఓడరేవును మంజూరు చేయడం తెలిసిందే. ఈ పోర్టు నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పటికే కృష్ణపట్నం పోర్టులో ఎగుమతులు, దిగుమతులు సాగుతుండడం, పోర్టు దక్షిణంవైపు రోడ్డు ఇక్కడి నుండే వెళుతుండడంతో ఎక్కడా లేనంతగా ఇక్కడ రియల్‌భూమ్ నెలకొంది. ఇక్కడికి దుగరాజపట్నంపోర్టు వచ్చిందన గానే కోట, వాకాడు, చిల్లకూరు మండలాల్లో భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. ముఖ్యంగా గూడూరు నుంచి కోట క్రాస్‌రోడ్డు వరకు జాతీయ రహదారి వెంబడి వున్న భూముల ధరలకు రెక్కలొచ్చాయి. అయితే ఆ పెట్టుబడిదారులకు తక్కువ వ్యయానికే మంచి ప్లాట్లు అందించాలనే ఉద్దేశ్యంతో రాఘవేంద్రరావు కోట క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారి వెంబడి 'రాఘవేంద్ర హైటెక్ సిటీ'ని అత్యంత హంగులతో, ఆధునిక వసతులతో రూపొందించాడు.

నెల్లూరుజిల్లా చిల్లకూరు మండలం కోట అడ్డరోడ్డు సమీపంలో జాతీయ రహదారిని అనుకుని ఏర్పాటుచేసిన రాఘవేంద్ర హైటెక్ సిటీని బుధవారం ప్రారంభించారు. కృష్ణపట్నం పోర్టుకు వెళ్ళే రోడ్డు, దుగరాజపట్నం పోర్టు రోడ్డుకు మధ్యలో తమ వెంచర్‌ను ప్రారంభించినట్లు టి.రాఘవేంద్రరావు తెలిపారు. తాగునీరు, విద్యుత్తు సౌకర్యం, డ్రైనేజీ తదితర వసతులను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బయ్యా మోహన్‌రావు, వి.రమణయ్య, డా॥రాము, చదలవాడ హరిబాబు, సౌత్ ఇండియన్ బ్యాంకు మేనేజర్, సహాయ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

## జగన్ సీఎం కావడం ఖాయం



నెల్లూరు వెంకట్రామపురంలో ఈనెల 18న ప్రజాదీవెన కార్యక్రమంలో పాల్గొన్న వైయస్సార్‌సీపీ నెల్లూరునగర సమన్వయకర్త డా॥ పి.అనిల్‌కుమార్‌యాదవ్‌కు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆశీస్సులతో వైయస్ జగన్మోహన్‌రెడ్డి సిఎం కావడం ఖాయమన్నారు. ఆయన సిఎం అయితే పేదప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు సజావుగా జరుగుతాయని, దాంతో వారి జీవితాల్లో చీకటి తొలగిపోతుందని పేర్కొన్నారు. దివంగత మహానేత వైయస్ రాజశేఖరరెడ్డి వృద్ధులకు పింఛన్లు విరివిగా ఇస్తే, నేటి సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డి వాటిని సక్రమంగా అందించకుండా రద్దు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నేతలు మాగుంట శ్రీకాంత్‌రెడ్డి, గూడూరు వాసుదేవరెడ్డి, కోటా శ్రీనివాసులు, లెక్కల వెంకారెడ్డి, భాస్కరాచారి, పోలంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సంక్రాంతి కల్యాణ్, లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జార్ల వెంకటేశ్వర్లు, ఇంతియాజ్, ఖదీర్‌ఖాన్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 'క్యాప్' సేవలు ప్రశంసనీయం



మాట్లాడుతున్న వి.వేణుగోపాలాచారి

అనాథల కోసం క్యాప్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి వి.వేణుగోపాలాచారి కొనియాడారు. నెల్లూరు నగరం కొండాయపాలెం గేటు సెంటర్‌లోని చైల్డ్ అండ్ పోలీస్ ప్రాజెక్టు(క్యాప్)ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వేణుగోపాలచారి మాట్లాడుతూ బోడిగాడితోటలోని అనాథ పిల్లలను ఎస్పీ రమణకుమార్ క్యాప్‌లో చదివిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేయడం అభినందనీయమన్నారు. ప్రతి జిల్లాలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే చిన్నారులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దిన వారవుతామని పేర్కొన్నారు. వసంతలక్ష్మి ఛారిటబుల్‌ట్రస్ట్ ఛైర్‌పర్సన్ టి.వసంతలక్ష్మి క్యాప్‌కు అందిస్తున్న సేవలను కొనియాడారు. క్యాప్‌కు తనవంతు సహాయం అందిస్తామని వేణుగోపాలాచారి అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మూర్తి, గూడూరు డిఎస్పీ చౌడేశ్వరి, అదనపు డిఎంహెచ్ఓ పద్మావతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

PDF Compressor Free Version





ఈ నెల 18వ తేదీన నెల్లూరులోని బొల్లినేని ఆసుపత్రిలో 40ఏళ్ళు దాటిన పోలీసు సిబ్బందికి మాస్టర్‌హెల్త్‌చెకప్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ బి.వి.రమణకుమార్, పక్కన వైద్యులు, పోలీసు సిబ్బంది.

# గూడూరు డివిజన్ వార్తలు

## గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



సునీల్‌కుమార్

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజక వర్గ సమన్వయకర్త పాశం సునీల్‌కుమార్ అన్నారు. గూడూరులోని పార్టీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి నివాసంలో సోమవారం సాయంత్రం గూడూరు రూరల్ పరిధిలోని 23పంచాయతీల్లోని పలు గ్రామాల నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను ఆయన మరణానంతరం ప్రస్తుత కాంగ్రెస్ పాలకులు నిర్వీర్యం చేశారన్నారు. పథకాల నిర్వీర్యంపై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించి వైఎస్ఆర్‌సీపీ మ్యానిఫెస్టోపై అవగాహన కల్పించాలన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మొదటి నుండి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ మంచి పేరున్న వారిని అభ్యర్థులుగా నిలబెడతామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ పార్టీ నాయకులు మల్లు విజయ కుమార్‌రెడ్డి, నాసిన నాగులు, మెట్టా రాధాకృష్ణారెడ్డి, నెలబల్లి భాస్కరరెడ్డి, రాజేశ్వరరెడ్డి, చెన్నూరు కృష్ణారెడ్డి, చిల్లకూరు రాజారెడ్డి, నాగరాజు, నరసరాజు, భాస్కర్‌రెడ్డి, రాజన్న, నిరంజన్‌రెడ్డి, మనోహర్, పెంచలయ్య, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో స్నేహవికాసం



విజేతలకు ట్రోఫీ ప్రదానం

గూడూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం యువనేస్తమ్ ఆర్గనైజేషన్, కామన్ మెన్ ప్రొటక్షన్‌ఫోర్స్ అధ్వర్యంలో మండలస్థాయి క్రికెట్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఇస్మాయిల్ మాట్లాడుతూ క్రీడలతో శారీరక ధృఢత్వంతో పాటు స్నేహభావం పెంపొందుతుందని అన్నారు. ఈ పోటీలలో విజేతలకు ట్రోఫీతో పాటు నగదు బహుమతిని ప్రధానం చేశారు. క్రికెట్ టోర్నమెంట్‌లు నిర్వహించి క్రీడాస్ఫూర్తిని చాటుతున్న యువనేస్తమ్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మాముదూరు హరిక్రిష్ణను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమార్, శ్రీను, తేజ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు సిద్ధం

### బాలచెన్నయ్య



త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ చెంతాటి బాలచెన్నయ్య పిలుపునిచ్చారు. గూడూరు నియోజకవర్గంలోని పట్టణ, రూరల్, చిల్లకూరు మండలాల్లో సోమవారం ఆయన పర్యటించి పలువురు పార్టీనాయకులను కలుసుకొని స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని కోరారు. గూడూరులోని సనత్‌నగర్, తిప్పగుంటపాళెంలలో కూడా తిరిగి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలిపించాలన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు నేరెళ్ల వెంకటరత్నం, ఎస్.చంద్రమోహన్, ఆలీ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కష్టాల్లో ఉన్న వారిని ఆదుకుందాం

కష్టాల్లో ఉన్న వారిని ఆదుకొనేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు స్నేహలతారెడ్డి కోరారు. గూడూరు సమీపంలోని సాయిబాబా మందిరంలో ఆదివారం ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్ర మహిళా మండలి ఆధ్వర్యంలో మతిస్థిమితంలేని వారితో పాటు పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళామండలి కార్యదర్శి ప్రభ, డాక్టర్ సి.రోహిణి, సారంగం సులక్ష్మి, సౌందర్య, విష్ణువందన పాల్గొన్నారు.

## పోలీసులకు సామర్థ్య పరీక్షలు

గూడూరు పట్టణంలోని ఒకటవ, రెండవ పోలీసుస్టేషన్‌లలో పనిచేసే పోలీసులకు 16వ తేదీ సామర్థ్యపరీక్షలను నిర్వహించారు. స్థానిక ఎస్ఎంజీ ఉన్నత పాఠశాల ఆవరణలో పోలీసులకు పరుగు, దేహదారుఢ్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సిఐ ఉప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ ఎస్పీ రమణకుమార్ ఆదేశాల మేరకు గూడూరు డీఎస్పీ చౌడేశ్వరి నేతృత్వంలో డివిజన్‌లో ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులకు సామర్థ్యపరీక్షలను ప్రతినెల నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒకటవ, రెండవ పట్టణ ఎస్సైలు షరీఫ్, అంకమరావు పాల్గొన్నారు.

## పేదలకు భూములు పంచాలి

గూడూరు మండలంలో అర్హులైన పేదలందరికి భూములను కేటాయించాలని కోరుతూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో గూడూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ రూరల్ పరిధిలోని కాంద్ర, విందూరు, వెందోడు, నెర్నూరు, గొల్లపల్లి తదితర గ్రామాల్లో వ్యవసాయ కార్మికులు పనులు లేక పస్తులుంటున్నారన్నారు. వీరిలో అర్హులైన పేదలకు భూమిని కేటాయించాలని, అలాగే అర్బన్ పరిధిలోని ఎగువ వీరారెడ్డిపల్లి దిగువ వీరారెడ్డిపల్లి, అశోక్‌నగర్ ప్రాంతాల్లో కార్మికులు, ఆటోవాలాలు, వ్యవసాయ కార్మికులకు ఎన్నో ఏళ్ళుగా కనీసం ఇళ్లు కూడా లేవన్నారు. ప్రతిరోజూ కూలీ పనులకు వెళ్లివచ్చే కూలీతో అద్దెలు కడుతూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అర్హులైన పేదవారికి పక్కాఇళ్లు, భూములు కేటాయించాలని కోరారు. అనంతరం తహశీల్దార్ మైత్రేయుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కేశవులు, మణి పాల్గొన్నారు.

# మూ'వీ'క్షణం




## ఆగుతున్న 'ఆగడు'

సుకుమార్ దర్శకత్వంలో మహేష్ హీరోగా నటిస్తున్న '1-నేనొక్కడినే' షూటింగ్ లండన్‌లో జరుగుతుంది. ఇది 60రోజుల షెడ్యూల్. దీని తర్వాత మరో షెడ్యూల్ కూడా అవసరమవుతుందని నిర్మాత అనిల్ సుంకర తెలిపారు. కాబట్టీ దసరాకు ఈ సినిమా రావడం కష్టమే. ఈ సినిమా రిలీజ్ అయితే గాని శ్రీనువైట్ల దర్శకత్వంలో మహేష్ చేసే 'ఆగడు' సెట్స్ మీదకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.



## నిమిషానికి లక్ష

ప్రభుదేవాను వదులుకున్నాక నయనతారకు సినిమా అవకాశాలు బాగానే తగులుతున్నాయి. దీంతో తెలుగులోను, తమిళంలోను బాగా బిజీ అయిపోయింది. ఈ సెక్సీ భామను అమెరికాలో జరగబోయే ఓ కార్యక్రమంలో పదినిమిషాల పాటు పాల్గొనాలని అక్కడి సంస్థ కోరింది. దీనికి ఆమె అన్ని ఖర్చులతో పాటు నిమిషానికి లక్ష చొప్పున పదిలక్షలు డిమాండ్ చేసింది. ఆమె డిమాండ్‌ను చూసి నిర్వాహకులు కళ్ళు తేలేసారు.



## 'సింహా' పంచ్‌డైలాగ్స్

బోయపాటి దర్శకత్వంలో యువరత్న బాలకృష్ణ పొలిటికల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను తెరకెక్కిస్తున్నారు. 2014 ఎలెక్షన్స్‌ను టార్గెట్ చేసుకుని బాలకృష్ణ ఈ సినిమాలో చిరంజీవిపై పొలిటికల్ డైలాగ్‌లు వదిలాడు. విలన్‌ను ఉద్దేశించి "నువ్వు పెట్టింది ఒక పార్టీ, ఉంటుంది మరో పార్టీ. సిబిఐ పేరు చెబితే వణుకుతావు... అదీ నీ రేంజ్. నా పార్టీ ఏదో జనాన్ని అడుగు చెబుతారు" అనే పవర్‌ఫుల్ డైలాగ్‌లు బాలకృష్ణ నోట పలికించాడు దర్శకుడు బోయపాటి.



## అల్లుడుతో 'ఓం'

తెలుగు తెరపై కల్యాణ్‌రామ్ రెండేళ్లుగా చేస్తున్న ప్రయోగాత్మక టెక్నికల్ వండర్ సినిమా 'ఓం'. 25కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమాపై తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ కన్ను పడింది. ఆయన ఈ సినిమాను కుటుంబ సమేతంగా ప్రత్యేకంగా చూసారు. రజనీకాంత్ ప్రత్యేకంగా కల్యాణ్‌రామ్‌కు ఫోన్ చేసి అభినందించారు. అంతే కాకుండా ఈ సినిమాను తమిళంలో రజనీకాంత్ అల్లుడు ధనుష్‌ను హీరోగా పెట్టి భారీ స్థాయిలో రీమేక్ చెయ్యాలనుకుంటున్నట్లు తెలుస్తుంది.



## ఇక తిరగలేను...!

వరుసగా సినిమాల్లో అవకాశాలు దొరికితే హీరోయిన్లు ఎగిరి గంతులేస్తారు. అది కూడా స్టార్‌హీరోల సరసన. కాని పాపులర్ హీరోయిన్ సమంత మాత్రం దిగులు పడిపోతుంది. ఈ అమ్మడు ఇప్పుడు సినిమాల్లో బాగా బిజీ అయిపోయింది. ఇంటి పట్టున వుండకుండా వివిధ దేశాలు పట్టుకుని తిరుగుతుంది. ఈ ప్రయాణాలతో బాగా అలసిపోయానని, తమిళంలో విజయ్‌తో చేస్తున్న చిత్రం పూర్తయితే కొంత కాలం విశ్రాంతి తీసుకుంటానని అంటుంది.

PDF Compressor Free Version






## బెగోరె అవార్డ్ కమిటీచే...

# సతీష్‌రెడ్డికి అభినందనసభ

జాతీయ, అంతర్జాతీయంగా ప్రసిద్ధిచెందిన వ్యక్తులను ప్రతిఏటా డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి అవార్డుతో సత్కరిస్తున్న డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి అవార్డు కమిటీ, వి.ఆర్. కళాశాల పూర్వవిద్యార్థులు కలిసి డిఆర్‌డిఓ డైరెక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డికి అభినందన సభను ఏర్పాటు చేసారు. ఈ అభినందన కార్యక్రమం ఈ నెల 27న సాయంత్రం 6గంటలకు నెల్లూరు టౌన్‌హాల్‌లో జరుగనుంది. రక్షణరంగ శాస్త్రవేత్తగా వుంటూ ఇటీవలే డిఆర్‌డిఓ రీసెర్చ్ సెంటర్ ఇమారత్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సతీష్‌రెడ్డి మన నెల్లూరీయుడే. ఆత్మకూరు మండలం మహిమలూరు స్వగ్రామం. మధ్య తరగతి రైతు కుటుంబంలో జన్మించిన ఆయన కృషి, పట్టుదలతో ఈ స్థాయికి చేరారు. ఆయన అభినందన కార్యక్రమానికి కేంద్రమంత్రి శ్రీమతి పనబాక లక్ష్మి, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాజ్యసభసభ్యులు యం.వెంకయ్యనాయుడు, నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, శాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, వియస్‌యు ఉపకులపతి ఆచార్య రాజా రామిరెడ్డి, డాక్టర్ వి.బి.సాయికృష్ణ యాచేంద్ర, ఏకలవ్య ఫౌండేషన్ ఛైర్మెన్ పి.వేణుగోపాల రెడ్డి, షార్ మాజీడైరెక్టర్ డాక్టర్ కె.నారాయణ, శాస్త్రవేత్త డాక్టర్ ఎ.జగదీష్‌లు విశిష్ఠ అతిథులుగా రానున్నారు. ఓ నెల్లూరీయుడు సాధించిన విజయానికిగాను జరుగుతున్న ఈ అభినందన విజయోత్సవసభకు నెల్లూరీయులు పెద్దఎత్తున విచ్చేయాలని బెగోరె అవార్డు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జె.వి.రెడ్డి బి.వి.నరసింహంలు ఒక ప్రకటనలో కోరారు.


BUY GENTS WEAR WORTH 2000/- 3500/- 4000/- 5000/- 7000/- 8000/-
GET FREE REEBOK BAG 1399/- 2999/- 3499/- 3999/- 6999/- 7999/-
'K' FOR MEN @ KALANIKETHAN SHOPPING MALL
Trunk Road, Gandhinagar, Nellore Ph: 2316677




పెట్టుబడిదారులకు గొప్ప అవకాశం...

నమ్మకమైన పెట్టుబడికి.. ఖచ్చితమైన రాబడికి...
అటు కృష్ణపట్నం పోర్టు, ఇటు దుగరాజపట్నం పోర్టు,
నడుమ జాతీయ రహదారిపై...

DTCP Layout

రాఘవేంద్ర హైటెక్ సిటీ @NH-5




Raghavendra Realtors & Developers
D.No. 15/465, Venkataramapuram, Nellore.

తలచీరు రాఘవేంద్రరావు

Contact : 0861 - 2340066 / 94914 51115 / 98666 82883 / 99898 61136.



Peram Group
GGR HOUSING INDIA PVT LTD.,
An ISO 9001-2008 Certified Company

HOT PROPERTY OF THE WEEK

TUDA Approved




పేరం హరిబాబు


తిరుపతి నగరం, తిరుచానూరు సమీపం, 200 అడుగుల బైపాస్‌రోడ్
హర్షా టయోటా షోరూం ఎదురుగా 50 ఎకరాల విస్తీర్ణంలో

PERAM Advaita Grand అద్వైత Grand
మెగా శాటిలైట్ టౌన్‌షిప్

NRI's బంధుమిత్రులకు విజ్ఞప్తి

మా అద్వైత గ్రాండ్ వివరాలు
www.peramgroup.com నందు సందర్శించి
info@peramgroup.com ఇ-మెయిల్ ద్వారా మమ్మలను సంప్రదించగలరని
NRI లకు సూచించవలసినదిగా కోరుచున్నాము.





PLEASE CALL FOR SITE VISIT :
Office : Air Bypass Road, Tirupathi
7799771537 / 38, 7799771548 / 54


Edited, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY.